- aruhi group
www.mahaaprabha.com

నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

మంగళవారం
4-08-2026

సంపుటి : 01 సంచిక : 133 పేజీలు : 08 వెల : ₹5/-

తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.

Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE133 NAMASTEY MAHAAPRABHA



Mr. NAKKA RAJU
Chairman of Mahaaprabha



ఈ-20పై నేడు మోదీ ఇంటికి మార్చ్..

- వంద మందితో కలిసి పిటిషన్లు అందజేస్తానన్న కేజ్రీవాల్
- మైలేజీ తగ్గి, ఇంజిన్ సమస్యలు వస్తున్నాయని ఆరోపణ
- 2023కు ముందు వాహనాల యజమానులు ఇబ్బందులు పడుతున్నారన్న వ్యాఖ్య
- ప్యూర్ పెట్రోల్‌తో పాటు ఈ-5, ఈ-10 విక్రయించాలని డిమాండ్
- ఇథనాల్ కొనుగోళ్లపై కేంద్రం వైఖరిని ప్రశ్నించిన ఆప్ అధినేత
- ఈ-20 ధరలు ప్యూర్ పెట్రోల్ కంటే ఎక్కువగా ఉన్నాయన్న విమర్శ
- 2 లక్షలకుపైగా వాహనదారుల సంతకాలతో పిటిషన్ సమర్పిస్తామని వెల్లడి



రోడ్డుంటే.. ఫుట్‌పాత్ ఉండాల్సిందే!..



ప్రపంచవ్యాప్తంగా 140 కోట్ల మందిపై నిఘా వేసిన చైనా..!

మోసానికి కేరాఫ్ అడ్రస్

బీఆర్ఎస్

– పెద్ది సుదర్శన్ రెడ్డిని మోసం చేసింది బీఆర్ఎస్సే

- పెద్ది సుదర్శన్ రెడ్డి బతికున్నప్పుడు నిర్లక్ష్యం చేశారు
- చనిపోయాక రాజకీయాల కోసం వాడుకుంటున్న కేటీఆర్
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



హైదరాబాద్

పదేండ్లు అధికారంలో ఉన్నా, ఉద్యమ కారుడు, దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వకుండా అవమానించింది బీఆర్ఎస్ అని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. సంతోష్ రావు, దామోదర్ రావు లాంటి వారికి రాజ్యసభ పదవులు ఇచ్చిన బీఆర్ఎస్, పెద్ది సుదర్శన్ రెడ్డి ఎమ్మెల్యేగా ఓడిపోయిన తర్వాత ఆయనకు రాజ్యసభ గానీ, ఎమ్మెల్సీ పదవి గానీ ఎందుకు ఇవ్వలేదు అని అన్నారు. పెద్ది సుదర్శన్ రెడ్డి గారిని వరంగల్ నుంచి హైదరాబాద్‌కు తరలించేందుకు గ్రీన్ ఛానెల్ ఏర్పాటు చేయడమే కాకుండా, అంత్యక్రియలను అధికారిక పోలీసు లాంఛనాలతో నిర్వహించి గౌరవించింది కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. ఉద్యమకారులను ఓట్ల కోసం, రాజకీయ ప్రయోజనాల

-మిగతా 3 లో



మోడీ--షాలకు ఇక ఇంటి దారే

- బంకిపూర్ తీర్పుతో బీజేపీ అహంకారానికి గట్టి ఎదురుదెబ్బ
- బీజేపీ కంచెకోటలో కాంగ్రెస్ విజయం దేశ రాజకీయాలకు సంకేతం
- బంకిపూర్ ప్రజలు గుణపాఠం చెప్పారని మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్య

హైదరాబాద్

బీహార్‌లోని బంకిపూర్ ఉప ఎన్నిక ఫలితం దేశ రాజకీయాల్లో కీలకమైన మార్పునకు సంకేతమని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. బీజేపీకి దశాబ్దాలుగా కంచెకోటగా ఉన్న బంకిపూర్‌లో ప్రజలు ఇచ్చిన తీర్పు అధికార అహంకారానికి గట్టి ఎదురుదెబ్బ అని ఆయన పేర్కొన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ రాజ్యసభకు ఎన్నిక కావడంతో ఖాళీ అయిన ఈ స్థానాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకోవడం సాధారణ విషయం కాదన్నారు. కేంద్రంలోనూ, బీహార్‌లోనూ అధికారంలో ఉన్న బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు తిరస్కరించారని వ్యాఖ్యానించారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల, రైతుల సమస్యలు, ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యం, సామాజిక విభజన రాజకీయాలను ప్రజలు గమనిస్తున్నారని మహేష్ కుమార్

-మిగతా 3 లో



02

డీలిమిటేషన్ బిల్లుపై డీఎంకే ఎటు?



ఇస్లామిస్టులతో కలిశాక లెఫ్టిస్టులు అవుతున్నారు

02

WINTAARA

Grow Your Business with Wintaara

Register | List | Connect | Grow

One Business Endless Possibilities.

WIDE RANGE OF PRODUCTS
BEST PRICES
TRUSTED NETWORK
PAN INDIA DELIVERY
SECURE & RELIABLE
DEDICATED SUPPORT

www.wintaara.com
info@wintaara.com
Hyderabad & Vijayawada

PAN INDIA DELIVERY

డీలిమిటేషన్ బిల్లుపై డీఎంకే ఎటు?

-ఇండియా కూటమి నుంచి నిష్క్రమించడంతో సర్వత్రా ఉత్కంఠ



న్యూఢిల్లీ: ఆగస్టు 3 (మహాప్రభ):
నియోజకవర్గాల పునర్విభజనను చేపట్టేందుకు రాజ్యాంగ సవరణ కోసం కొత్త బిల్లును తీసుకురావడంపై నరేంద్ర మోదీ ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఎటువంటి అధికారిక ప్రకటన రానప్పటికీ ఒకవేళ తీసుకువచ్చిన పక్షంలో లోక్‌సభలో 22 మంది సభ్యులు, రాజ్యసభలో 8 మంది సభ్యులు ఉన్న డీఎంకే వైఖరి పైనే సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఈ వివాదాస్పద బిల్లుకు లోక్‌సభలో ఆమోదం పొందడం ప్రభుత్వానికి కష్టతరం కానున్నది. తమిళనాడులో విజయ్ ప్రభుత్వానికి మద్దతిచ్చి కాంగ్రెస్ నమ్మక ద్రోహానికి పాల్పడిందని ఆరోపిస్తూ ఇండియా కూటమి నుంచి వెలుపలకు వచ్చిన డీఎంకే రాజ్యాంగ సవరణ బిల్లుకు మద్దతు ఇవ్వడంపై ఇప్పటివరకు ఎటువంటి స్పష్టత ఇవ్వలేదు.అయితే కొత్త బిల్లును పరిశీలించిన తర్వాతే తన ఆలోచనను బయటపెడతానని ఆ పార్టీ స్పష్టం చేసింది. తాము కాంగ్రెస్‌తో పనిచేయకపోవచ్చేమో కాని ప్రతిపక్ష పాత్రను మాత్రం వదిలిపెట్టలేదని ఆ పార్టీ నేతలు స్పష్టం చేశారు. వందేమాతరం బిల్లు, పేపర్ లీక్ వ్యవహారానికి సంబంధించిన బిల్లుపై సవరణలు ప్రతిపాదించడం ద్వారా, అలాగే వాటికి వ్యతిరేకంగా ఓటు వేయడం ద్వారా తాము తమ వైఖరిని చాటుకున్నామని వారు గుర్తుచేస్తున్నారు. డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ నిరసనలో భాగంగా డీలిమిటేషన్ బిల్లు ప్రతిని ఇప్పటికే దహనం చేసినందున ఆ పార్టీ ఈ బిల్లుకు అనుకూలంగా ఓటు వేయదని ఇండియా కూటమిలోని పార్టీలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

కర్ణాటక కాంగ్రెస్‌లో విస్తరణ చిచ్చు..

-మంత్రి పదవి ఇవ్వలేదని ఇద్దరు ఎమ్మెల్యేల రాజీనామా



న్యూఢిల్లీ: ఆగస్టు 3 (మహాప్రభ)::
కర్ణాటక క్యాబినెట్ విస్తరణ వేళ అధికార కాంగ్రెస్‌లో అసమ్మతి చిచ్చు రాజుకుంది. క్యాబినెట్ విస్తరణలో తమకు చోటు దక్క లేదన్న అసంతృప్తితో సోమవారం ఇద్దరు సీనియర్ కాంగ్రెస్ శాసనసభ్యులు తమ శాసన సభ్యత్వానికి రాజీనామా ప్రకటించారు. మంత్రివర్గంలో చోటు దక్కలేదని ఇండీ నియోజకవర్గానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే యశ్వంత్‌రాయగౌడ, సాగర్‌కు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యే బేలూర్ గోపాలకృష్ణ తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు.తనకు మంత్రి పదవి ఇస్తానన్న వాగ్దానాన్ని నిలబెట్టుకోవడంలో పార్టీ విఫలమైందని పాటిల్ విమర్శించగా మాజీ ముఖ్యమంత్రుల పిల్లలకే కాంగ్రెస్‌లో ప్రాధాన్యత లభిస్తున్నదని గోపాలకృష్ణ ఆరోపించారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన రెండు నెలలకు డీకే మంత్రివర్గాన్ని విస్తరించారు. క్యాబినెట్‌లో 19 మందికి చోటు కల్పించారు. గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్ నూతన మంత్రులతో ప్రమాణం చేయించారు. అసంతృప్త ఎమ్మెల్యేల వ్యాఖ్యలపై డీకే స్పందిస్తూ, 'ఇంత కుముందు సిద్ధరామయ్య క్యాబి నెట్‌లో నాకూ మంత్రి పదవి దక్కలేదు. అర్హులైన వారు చాలామంది ఉన్నా..అందరికీ చోటు కల్పించలేం కదా!' అని అన్నారు.

కావేరీ జలాలపై సుప్రీంకు తమిళనాడు



న్యూఢిల్లీ: ఆగస్టు 3 (మహాప్రభ)::
కావేరీ జలాల వివాదంపై తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. కావేరీ వాటర్ మేనేజ్‌మెంట్ అథారిటీ(సీడబ్ల్యూఎంఏ), కావేరీ రెగ్యులేషన్ కమిటీ(సీడబ్ల్యూఆర్‌సీ) ఆదేశాలను కర్ణాటక ప్రభుత్వం ఉల్లంఘించిందని, తమకు దక్కాల్సిన నీటిని విడుదల చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ సోమవారం సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసింది. ముఖ్యమంత్రి విజయ్ ఆదేశాల మేరకు ఈ పిటిషన్ దాఖలు చేసినట్లు అధికారులు తెలిపారు.కర్ణాటకకు తగినంత నీటి లభ్యత ఉన్నప్పటికీ నీటి విడుదలకు నిరాకరించడం తగదని తమిళనాడు పేర్కొంది. తమకు రావాల్సిన కావేరీ జలాలను ఇప్పించాలని కోర్టును అభ్యర్థించింది

రేపు జంతర్ మంతర్‌లో పెన్షనర్ల నిరసన

రూ.7,500 నెలవారీ పెన్షన్ ఇవ్వాలని డిమాండ్



న్యూఢిల్లీ: ఆగస్టు 3 (మహాప్రభ):
దేశంలో వరుస నిరసనలు తెరమీదికొస్తున్న నేపథ్యంలో ఆగస్టు 5న దేశవ్యాప్త నిరసనలకు జాతీయ పింఛనుదారుల సంఘం ఈపీఎస్95 పిలుపునిచ్చింది. ఉద్యోగ పెన్షన్ పథకం కింద నెలవారీ పింఛన్ రూ.7,500 ఇవ్వాలని.. లేదంటే ఆత్మాహుతి చేసుకోవడమే తమకున్న ఏకైక మార్గం అని పింఛనుదారుల సంఘం వెల్లడించింది.రేపు వేలాది మంది పెన్షన్‌దారులు జంతర్ మంతర్ వద్ద నిరసన తెలుపుతారని.. దేశ వ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లోనూ నిరసనల్లో పాల్గొనాలని ఈ సంఘం కోరింది. ప్రస్తుతం నెలవారీ పింఛను రూ.1000 ఇస్తున్నారని.. 2014లో తీసుకొచ్చిన ఈ పెన్షన్ స్కీమ్‌లో సంస్కరణలు చేయాలని పింఛనుదారుల సంఘం కమాండర్ అశోక్ రౌత్ డిమాండ్ చేశారు. తాము ఎన్నోసార్లు విజ్ఞప్తి చేసినా కేంద్ర ప్రభుత్వం సంస్కరణలు చేయడంలో విఫలమైందని తెలిపారు.

నా స్కాలర్‌షిప్ వివరాలు వెల్లడిస్తా.. మరి చక్రవర్తి తన డిగ్రీని చూపిస్తారా?.

న్యూఢిల్లీ: ఆగస్టు 3 (మహాప్రభ):



ఆర్టీఐ వివాదంపై బీజేపీపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే విరుచుకుపడ్డారు. తన విద్యాభ్యాసంపై ఆర్టీఐ ద్వారా వివరాలు కోరిన నేపథ్యంలో, బీజేపీ నేతలు కూడా తమ డిగ్రీలను బహిరంగంగా వెల్లడించాలని ఆయన సవాల్ విసిరారు. తన అమెరికా చదువుకు బోస్టన్ నుంచి వచ్చిన స్కాలర్‌షిప్, ఎడ్యుకేషన్ లోన్ ద్వారా నిధులు సమకూరినట్లు దీప్కే స్పష్టం చేశారు. సోషల్ మీడియా వేదికగా ఆయన స్పందిస్తూ 'నా స్కాలర్‌షిప్ లెటర్, ఎడ్యుకేషన్ లోన్ పత్రాలను బయటపెట్టడానికి నేను సిద్ధంగా ఉన్నాను.

భర్త కానంత మాత్రాన సహజీవన భాగస్వామిని వేధించి తప్పించుకోలేరు



న్యూఢిల్లీ: ఆగస్టు 3 (మహాప్రభ):
సహజీవనంపై భారత అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు సంచలన తీర్పు చెప్పింది. సహజీవనంలో కూడా భాగస్వామిని వేధింపులకు గురిచేస్తే భారతీయ శిక్షాస్మృతి లోని సెక్షన్ 498-ఏ ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయవచ్చని స్పష్టంచేసింది. పెళ్లి కాలేదనే కారణంతో భర్త స్థానంలో ఉన్న వ్యక్తి వేధింపుల ఆరోపణల నుంచి తప్పించుకోలేరని పేర్కొన్నది. వివాహం కాలేదన్న కారణాన్ని చూపి బాధితురాలికి చట్టపరమైన రక్షణ కల్పించకపోవడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14కు విరుద్ధమని తెలిపింది.ఈ మేరకు జస్టిస్ సంజయ్ కరోల్, జస్టిస్ ఎన్ కోటిశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించింది. ఈ సందర్భంగా భర్త అనే పదానికి ధర్మాసనం విస్తృత వివరణను ఇచ్చింది. సహజీవనం చేస్తున్న వ్యక్తిని భర్తతో సమానంగా పరిగణించవచ్చని తెలిపింది. ఇలాంటి వ్యక్తులు భాగస్వామిని వేధించి తప్పించుకోలేరని ధర్మాసనం చెప్పింది. అయితే అన్ని రకాల సహజీవనాలకు ఈ తీర్పు వర్తించదని తెలిపింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించి సహజీవనం చేస్తూ హింసకు పాల్పడిన వారికే సెక్షన్ 498-ఏ వర్తిస్తుందని వెల్లడించింది. అదేవిధంగా ఇలాంటి కేసుల్లో ప్రాథమిక విచారణ నిర్వహించకుండా తక్షణ అరెస్టులు చేయవద్దని పోలీసులకు కఠిన ఆదేశాలు జారీచేసింది. ఈ సందర్భంగా సెక్షన్ 498-ఏ ఉద్దేశాన్ని ధర్మాసనం వివరించింది. ఈ సెక్షన్ మహిళలను భర్త లేదా అతని కుటుంబసభ్యుల మానసిక, శారీరక వేధింపుల నుంచి రక్షించడానికే అని గుర్తుచేసింది. అలాంటి వేధింపులు కేవలం చట్టబద్ధమైన వివాహ బంధంలోనే జరుగుతాయని భావించడం వాస్తవాలకు విరుద్ధమని వ్యాఖ్యానించింది. వివాహిత మహిళకు ఒక రకమైన రక్షణ కల్పించి, అదే తరహా సంబంధంలో ఉన్న మరో మహిళకు రక్షణ నిరాకరించడం సహేతుకం కాదని ధర్మాసనం అభిప్రాయపడింది.వ్యక్తిగత స్వేచ్ఛలో భాగంగా జీవిత భాగస్వామిని ఎంచుకునే హక్కును చట్టం గుర్తించిందని ధర్మాసనం తెలిపింది. ఆ విధంగా భాగస్వామిని ఎంచుకున్న మహిళకు చట్టపరమైన రక్షణను నిరాకరించలేమని పేర్కొన్నది. సహజీవనం చేస్తున్న మహిళకు తన భాగస్వామి లేదా అతని కుటుంబసభ్యుల నుంచి వేధింపులు ఎదురైతే ఆమెకు కూడా సమాన చట్టపరమైన రక్షణ కల్పించాల్సిందేనని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది.

ఇస్లామిస్టులతో కలిశాక లెఫ్టిస్టులు అవుతున్నారు:

న్యూఢిల్లీ: ఆగస్టు 3 (మహాప్రభ):
బీజేపీ ఎంపీ కంగనా రనౌత్ తన ఎక్స్ అకౌంట్‌లో ఓ వీడియోను పోస్టు చేశారు. దాంట్లో ఆమె తన ఫీలింగ్ వ్యక్తం చేశారు. తానొక జాగృతి చెందిన హిందువు మహిళను అని ఆమె పేర్కొన్నారు. అయితే ఇస్లామిస్టులతో కలిసిన తర్వాత హిందూ మహిళలు కరుడుకట్టిన వామపక్షవాదుల తరహా మారుతున్నట్లు ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. మధ్యస్త హిందువు మహిళగా ఉన్న తాను జాగృతి చెందిన హిందువుగా మారినట్లు పేర్కొన్నారు. కొన్ని రోజుల క్రితం కాక్రోచ్ జనతా పార్టీపై తీవ్ర స్థాయిలో వ్యాఖ్యలు చేశారామె. సీజేపీ ఓ మురికికాలువ అంటూ ఆమె తన ఎక్స్‌లో వివాదాస్పద పోస్టు చేశారు. తాజా వీడియో మెసేజ్‌లో కంగనా రనౌత్ మాట్లాడుతూ.. ఒక ఫీలింగ్ షేర్ చేసుకోవాలని ఉందన్నారు. పార్లమెంట్‌కు వెళ్లడం ఆలస్యం అవుతున్నా, తన ఫీలింగ్‌ను పంచుకోవడం ముఖ్యమన్నారు.ఫిల్మ్ ఇండస్ట్రీలో మహిళల గురించి ఆమె తన



వీడియోలో ప్రస్తావించారు. అనేక మంది హిందువు మహిళలతో తనకు పరిచయ ఉందని, కానీ ఎవరికీ రాజకీయంగా కానీ, మతపరంగా కానీ చాలా వరకు మహిళల్లో అవగాహన ఉండేదికాదన్నారు. సాధారణంగా యువతలో ఇలాంటి లక్షణాలు కనిపిస్తుంటాయని, వాళ్లు తటస్థంటా ఉంటారన్నారు. కానీ ఇస్లామిస్టులతో పరిచయం ఏర్పడిన తర్వాత.. ఆ మహిళల్లో మార్పులు వస్తుంటాయని కంగనా అన్నారు. ఇస్లామిస్టులతో కలిసిన తర్వాత లెఫ్టిస్టులు అవుతారని, దీంట్లో ఎటువంటి నష్టం లేదని, ఎందుకంటే రాజ్యాంగం వాళ్లకు ఆ స్వేచ్ఛ ఇచ్చిందని, మనకు కావాల్సిన ఏదైనా మతాన్ని కానీ, ఐడియాలజీని కానీ స్వీకరించవచ్చు అన్నారు. అయితే తాను ఇప్పుడు మధ్యస్థ హిందువును కాదు అన్నారు. అయితే ఇప్పుడు తనను వేధిస్తున్నారని, సంఘ్‌పరివార్‌లో ఎప్పుడు చేరానని అడుతున్నారని, ఇప్పుడు నేనొక జాగృతి పొందిన హిందువును అని, బీజేపీ, ఆర్ఎస్ఎస్ తరహా లాంటి హిందువును అని, మార్పిడి జరగాలని కోరుతున్నానని, తానెందుకు మార్పిడి కావొద్దన్నారు. హిందువు మహిళలు ఓ నిర్దిష్ట ఐడియాలజీ ఐడెంటిటీ కోసం పోరాటం చేయాలన్నారు. మార్పిడితో చైతన్యం పొందాలని, మరి ఆ దారిని ఎందుకు మూసివేస్తున్నారని ఆమె అడిగారు.

'రష్యన్ అమెజాన్' వేర్‌హౌజ్‌పై ఉక్రెయిన్ డ్రోన్ దాడి



న్యూఢిల్లీ: ఆగస్టు 3 (మహాప్రభ):
రష్యాపై భీకర స్థాయిలో డ్రోన్లతో అటాక్ చేసింది ఉక్రెయిన్. శనివారం రష్యా చేసిన దాడికి ప్రతీకారంగా ఉక్రెయిన్ విరుచుకుపడింది. అయితే వ్లాదిమిర్ ప్రాంతంలో ఉన్న వేర్‌హౌజ్ ను టార్గెట్ చేసింది. రష్యాన్‌లో ఆన్‌లైన్ రిటేలర్‌గా ఉన్న వైల్డ్‌బెర్రీస్ వేర్‌హౌజ్‌పై దాడి చేసింది. దీన్ని రష్యా అమెజాన్‌గా కీర్తిస్తుంటారు. మాస్కోకు సుమారు 180 కిలోమీటర్ల దూరంలో ఉన్న వ్లాదిమిర్ ప్రాంతంలో ఉన్న వేర్‌హౌజ్‌ను డ్రోన్‌తో అటాక్ చేసినట్లు వీడియోలు రిలీజ్ అయ్యాయి. వైల్డ్ బెర్రీస్ వేర్‌హౌజ్.. రష్యాలో కీలకమైన లాజిస్టిక్ హబ్. అయితే ఆ కేంద్రాలను ఉక్రెయిన్ టార్గెట్ చేస్తున్నది. రష్యా మిలిటరీకి డ్రోన్ కాంపోనెంట్లు, నావిగేషన్ ఎక్విప్మెంట్, ఇతర సామాగ్రిని ఈ వేర్‌హౌజ్‌ల నుంచి సరఫరా చేస్తుంటారు. వైల్డ్‌బెర్రీస్ సైట్లపై ఇటీవల ఉక్రెయిన్ వరుసగా దాడి చేస్తున్న విషయం తెలిసిందే. శనివారం రష్యా బాలిస్టిక్ క్షిపణులతో కీవ్‌పై దాడి చేసింది. ఆ ఘటనలో 9 మంది మృతిచెందగా, డజన్ల సంఖ్యలో గాయపడ్డారు. ఉక్రెయిన్‌లోని పలు నగరాల్లో విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది.

గాలి నుంచి సాగునీరు!..

-అమెరికా విద్యార్థి వినూత్న ఆవిష్కరణ



న్యూఢిల్లీ: ఆగస్టు 3 (మహాప్రభ):
ప్రపంచవ్యాప్తంగా కరువులు తరచూ సంభవిస్తున్న వేళ, అమెరికాకు చెందిన 13 ఏండ్ల విద్యార్థి రైతులకు ఉపయోగపడేలా గాలి నుంచి సాగు నీటిని ఉత్పత్తి చేసే విధానాన్ని ఆవిష్కరించాడు. బీవర్టన్‌లోని విట్‌ఫోర్డ్ మిడిల్ స్కూల్లో చదువుతున్న రాయ్ కిమ్ వాతావరణంలోని తేమను గ్రహించి దాన్ని సాగు నీటిగా మార్చే చాంబర్‌ను రూపొందించాడు. ఈ ఆవిష్కరణ 2026 3ఎమ్ యంగ్ సైంటిస్ట్ చాలెంజ్‌లో టాప్-10 నేషనల్ ఫైనలిస్ట్‌లో అతడికి చోటు దక్కేలా చేసింది.

ఎలా పని చేస్తుంది?
ఇది పెల్టియర్ మాడ్యూల్ సాంకేతికత ఆధారంగా పని చేస్తుంది. ఈ పరికరంలో విద్యుత్తును సరఫరా చేసినప్పుడు ఈ మాడ్యూల్ ఒక వైపు వేడిని, మరోవైపు చల్లదనాన్ని సృష్టిస్తుంది. ఈ పరికరంలోని చాంబర్‌లోకి గాలిని ప్రవేశపెట్టిన తరవాత అది కొద్దిగా వేడెక్కి తర్వాత ఫ్యాన్ సహాయంతో చల్లని ఉపరితలం వైపు నెట్టబడుతుంది. అక్కడ గాలిలోని తేమ చల్లని ఉపరితలాన్ని తాకినప్పుడు నీటి బిందువులుగా మారుతుంది. ఈ నీటి బిందువులను గరాటు ద్వారా సేకరించి వాల్వ్ ఉపయోగించి మొక్కలకు అందిస్తారు. ఈ వ్యవస్థలో నేలలోని తేమ, ఉష్ణోగ్రత, నీటి ఆవిరి సెన్సార్లు ఉన్నాయి. ఇవి గాలి ప్రవాహాన్ని ఆటోమేటిగ్గా సర్దుబాటు చేస్తాయి. మొక్కలకు ఎప్పుడు నీళ్లు అవసరమో తెలుసుకొని, అనవసర నీటి వాడకాన్ని నివారిస్తాయి.

మోడీ--షాలకు ఇక ఇంటి దారే

మొదటి తరువాయి

గౌడ్ అన్నారు. ఎంత బలమైన రాజకీయ కోట అయినా ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలని బంకిపూర్ మరోసారి నిరూపించిందని పేర్కొన్నారు. ప్రచారాలతో కాదు, ప్రజలకు ఫలితాలిచ్చే పాలనతోనే విశ్వాసాన్ని గెలుచుకోవాలని ఈ తీర్పు స్పష్టం చేస్తోందన్నారు. దేశ ప్రజలు ప్రత్యామ్నాయ రాజకీయాల కోసం ఎదురుచూస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ వైపు ఆశగా చూస్తున్నారని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం, సామాజిక న్యాయం, రాజ్యాంగ విలువల పరిరక్షణ, సమగ్ర అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యమని పేర్కొన్న ఆయన, బంకిపూర్ ప్రజలకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ప్రజాస్వామ్యంలో అంతిమ విజయం ఎప్పుడూ ప్రజలదేనని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.

మోసానికి కేరాఫ్ అడ్రస్ బీఆర్ఎస్

మొదటి తరువాయి

కోసం వాడుకోవడం... అధికారం, కీలక పదవులన్నింటినీ కల్వకుంట్ల కుటుంబమే అనుభవించడం...కల్వకుంట్ల కుటుంబానికి వెన్నుతో పెట్టిన విద్య అని అన్నారు. మరణాలను సైతం రాజకీయ లబ్ధి కోసం ఉపయోగిస్తూ నీచానికి దిగజారిన బీఆర్ఎస్ పార్టీకి వచ్చే ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు మరోసారి గుణపాఠం చెప్పడం ఖాయం అని ఆయన అన్నారు.

ఈ-20పై నేడు మోదీ ఇంటికి మార్చ్..

- వంద మందితో కలిసి పిటిషన్లు అందజేస్తానన్న కేజ్రీవాల్
- మైలేజీ తగ్గి, ఇంజిన్ సమస్యలు వస్తున్నాయని ఆరోపణ
- 2023కు ముందు వాహనాల యజమానులు ఇబ్బందులు పడుతున్నారన్న వ్యాఖ్య
- ప్యూర్ పెట్రోల్‌తో పాటు ఈ-5, ఈ-10 విక్రయించాలని డిమాండ్
- ఇథనాల్ కొనుగోళ్లపై కేంద్రం వైఖరిని ప్రశ్నించిన ఆప్ అధినేత
- ఈ-20 ధరలు ప్యూర్ పెట్రోల్ కంటే ఎక్కువగా ఉన్నాయన్న విమర్శ
- 2 లక్షలకుపైగా వాహనదారుల సంతకాలతో పిటిషన్ సమర్పిస్తామని వెల్లడి



న్యూఢిల్లీ -03ఆగస్టు,(మహాప్రభ)

ఈ-20 పెట్రోల్‌పై నేడు ప్రధాని నరేంద్ర మోదీ ఇంటికి వంద మందితో మార్చ్ నిర్వహించి పిటిషన్లు అందజేస్తానని ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'దేశంలో ఈ-20 పెట్రోల్ అమ్మడం వల్ల వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. మైలేజీ తగ్గిపోవడం, ఇంజిన్‌లో రిపేర్లు వస్తున్నాయి. 2023 కంటే ముందు వాహనాల ఓనర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ-20ని కేంద్రం కొనసాగించడం వెనక రహస్య ఎజెండా ఉంది.అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒత్తిడి వల్లే యూఎస్ నుంచి భారత్ ఇథనాల్ కొంటున్నది. నేను లేఖ రాసినా మోదీ స్పందించలేదు. అందుకే ఆయన ఇంటికెళ్లి ఫిర్యాదు చేస్తా. అన్ని పెట్రోల్ బంకుల్లో ప్యూర్ పెట్రోల్ తో పాటు ఈ-5, ఈ-10 పెట్రోల్ కూడా అమ్మాలన్నదే మా డిమాండ్' అని కేజ్రీవాల్ తెలిపారు. ఈ-20 పెట్రోల్ ధరలు తక్కువగా ఉండాల్సింది పోయి ఇతర దేశాలలో దొరుకుతున్న ప్యూర్ పెట్రోల్ కంటే ఎక్కువ రేట్లకు అమ్ముతున్నారని కేజ్రీవాల్ ఆరోపించారు.తాను మోదీకి ఇవ్వబోయే పిటిషన్లపై 2లక్షల మందికి పైగా వాహనదారులు సంతకం చేశారని.. దీన్ని బట్టి ఇథనాల్ పెట్రోల్ మీద ఉన్న వ్యతిరేకతను గ్రహించాలని కేజ్రీవాల్ కోరారు.

రోడ్డుంటే.. ఫుట్‌పాత్ ఉండాల్సిందే!..

- కేంద్ర ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశం
- ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని కేంద్రానికి సూచన
- రెండు వారాల్లో కార్యాచరణ చేపట్టాలని గడువు



న్యూఢిల్లీ -03ఆగస్టు,(మహాప్రభ)

దేశంలోని ప్రతి రోడ్డుపై పాదచారుల కోసం ప్రత్యేక మార్గం ఉండేలా చూడాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఓ రోడ్డు ప్రమాదం కేసుపై విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ మేరకు అదనపు సొలిసిటర్ జనరల్ కేఎం నటరాజ్‌కు సూచించింది. 'పెద్దగా పెట్టుబడి, నిర్మాణాల అవసరం లేకుండానే పాదచారుల కోసం కేటాయించిన స్థలాన్ని ప్రత్యేకంగా గుర్తించండి.ఎక్కడ రోడ్డు ఉంటే.. అక్కడ పాదచారుల కోసం ప్రత్యేక ప్రదేశం ఉండాలి. అది తాడుతోనైనా లేక ఇంకా ఏ విధంగానైనా సరే రోడ్డుపై పాదచారులకు ప్రత్యేక మార్గం ఉండాలి, ఆ స్థలం ఆక్రమణకు గురికాకుండా చూసుకోవాలి' అని ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీచేసేందుకు కేంద్ర సర్కార్‌కు రెండు వారాల గడువునిచ్చింది.

ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి కాపర్ వైరు కాజేసిన దుండగులు

చిట్వేల్, -03ఆగస్టు,(మహాప్రభ)

చిట్వేల్ మండలం తుమ్మకొండ గ్రామపంచాయతీ పరిధిలోని చిన్నరాజుపల్లి శివారులో గుర్తుతెలియని దుండగులు వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులోని కాపర్ కాయిల్స్‌ను కాజేశారు. ఈ ఘటన సోమవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. బాధిత రైతు పాములపాటి వెంకటేశ్వర్లు నాయుడు తెలిపిన వివరాల మేరకు, పొలానికి వెళ్లిన సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ పగులగొట్టి ఉండడంతో పాటు అందులోని కాపర్ కాయిల్స్ కనిపించలేదు. దీంతో వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న ఏఈ బాలకృష్ణ సంఘటన స్థలాన్ని పరిశీలించి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నిందితులను గుర్తించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిసింది. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లపై వరుస చోరీలు జరుగుతుండటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రపంచవ్యాప్తంగా 140 కోట్ల మందిపై నిఘా వేసిన చైనా..!

- సొంత పౌరులతో పాటు విదేశీయులపైనా పర్యవేక్షణ
- పాస్‌పోర్ట్, ఫోన్ నంబర్ల నుంచి ప్రయాణాల వరకు నమోదు
- రహస్య వెబ్‌సైట్‌లో బయటపడిన నిఘా వ్యవస్థ
- భారత్, పాక్ పౌరుల వివరాలు అధికంగా గుర్తింపు
- కెమెరాలు, మొబైల్ సిగ్నల్స్‌తో కదలికల ట్రాకింగ్
- స్వదేశాలకు వెళ్లినా కొనసాగుతున్న చైనా నిఘా
- విమానాలు, రైళ్ల వివరాలూ డేటాలో భద్రం
- వెబ్‌సైట్ అదృశ్యం.. చైనా నుంచి స్పందన కరువు



న్యూఢిల్లీ-03ఆగస్టు,(మహాప్రభ)

చైనా ప్రపంచవ్యాప్తంగా 140 కోట్లకుపైగా ప్రజలపై నిఘా పెట్టినట్లు అమెరికా కు చెందిన ఓ పత్రిక సంచలన కథనాన్ని వెలువరించింది. ఆ దేశ నిఘాలోని వారిలో సొంత పౌరులు సహా సందర్శనకు వచ్చిన విదేశీయులు కూడా ఉన్నట్లు తెలిపింది. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. చైనా తన సొంత ప్రజలపై ఎలా నిఘా పెడుతుందో తెలుసుకోవడానికి జనవరిలో మార్క్ హోఫర్ అనే సైబర్ సెక్యూరిటీ పరిశోధకుడు ఇంటర్నెట్‌లో వెతుకుతుండగా.. 'డైనమిక్ కంట్రోల్ ప్లాట్‌ఫామ్ ఫర్ ఓవర్సీస్ పర్సనల్' అనే వెబ్‌సైట్‌లో తన పేరు, ఫొటో, పాస్‌పోర్ట్ సంఖ్య, గతంలో చైనా పర్యటన సమయంలో ఉపయోగించిన మొబైల్ నంబర్ సహా అన్ని వివరాలు కనిపించడంతో దిగ్భ్రాంతికి గురయ్యారు. ఆ వెబ్‌సైట్‌లో ముఖ్యంగా చైనాలోని జాంగ్‌జియాకోవు నగరానికి వెళ్లిన విదేశీయుల వివరాలు అధికంగా ఉన్నట్లు గుర్తించారు. వారిలో భారత్, తైవాన్, ఆస్ట్రేలియా, కెనడా, న్యూజిలాండ్, బ్రిటన్, అమెరికా, ఈజిప్ట్, ఇరాన్, ఇజ్రాయెల్, మొరాకో, పాకిస్థాన్, సూడాన్ ప్రజలు ఉన్నట్లు తెలుస్తోంది. జాంగ్‌జియాకోవు హెబే నార్త్ యూనివర్సిటీలో చేరిన విదేశీ విద్యార్థుల సమాచారం కూడా ఇందులో ఉంది. అయితే వారిలో భారత్, పాక్‌కు చెందిన వారే అధికం కావడం గమనార్హం. ఆ వెబ్‌సైట్‌లో వారి వ్యక్తిగత వివరాలు సహా వారు ఎక్కడెక్కడికి వెళ్తున్నారు, ఏం చేస్తున్నారనే సమాచారం నమోదై ఉన్నది. వీరందరినీ చైనా అధికారులు కెమెరాలు, ఫోన్ సిగ్నల్స్ ద్వారా ట్రాక్ చేస్తున్నారు. వారందరూ స్వదేశాలకు వెళ్లాక కూడా ఈ నిఘా కొనసాగుతుండడం గమనార్హం. చైనాలోని పోలీస్ విభాగాలకు రోబోటిక్స్, నిఘా పరికరాలను విక్రయించే 'ఆరిజిన్ డైనమిక్' అనే సంస్థకు కూడా ఈ వెబ్‌సైట్‌తో సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ డేటా అక్కడి పోలీసులకు అందుబాటులో ఉంది. ప్రజలు ఎక్కిన విమానాలు, వారి సీటు నెంబరు, రైళ్ల వివరాలు అందులో అందుబాటులో ఉన్నాయి. 2019లో హాంకాంగ్‌లో భారీ స్థాయిలో ప్రభుత్వ వ్యతిరేక ప్రదర్శనలు చెలరేగినప్పటి నుంచి అక్కడి ప్రభుత్వం నిఘాను మరింత పెంచింది. దేశ ప్రజల విదేశీ భాగస్వాములపైనా ప్రత్యేక నిఘా ఉంచింది. అయితే ఈ సైట్‌లోని సమాచారమంతా మే నెలలో అదృశ్యం కావడం గమనార్హం. సైబర్ సెక్యూరిటీ పరిశోధకుడు మార్క్ హోఫర్ అప్పటికే వెబ్‌సైట్‌లోని డేటాను డౌన్‌లోడ్ చేసుకోవడంతో ఈ వివరాలు వెలుగులోకి వచ్చాయి. ఈ కథనాలపై చైనా నుంచి ఎటువంటి అధికారిక స్పందన రాలేదు.

అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

- మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి
- రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ..
- పాట్టిపాడులో సీసీ రోడ్ల ప్రారంభం
- 'ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమంలో మంత్రి బీసీ



నంద్యాల -03ఆగస్టు,(మహాప్రభ)

ఉమ్మడి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో పేద ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి అన్నారు. సోమవారం బనగానపల్లె నియోజకవర్గంలో నిర్వహించిన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. కోవెలకుంట్ల మండలం పొట్టిపాడు గ్రామంలో రైతులకు "రాజముద్ర"తో కూడిన కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం పొట్టిపాడు గ్రామంలోని బీసీ, ఎస్సీ కాలనీల్లో సుమారు రూ.35 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో పట్టాదారు పాస్ పుస్తకాలను తప్పులు తడకగా మార్చడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాజముద్రతో కూడిన కొత్త పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ ద్వారా రైతుల భూ హక్కులను పరిరక్షిస్తున్నామని తెలిపారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ల్యాండ్ టైటిల్ యాక్ట్ అనే చీకటి చట్టాన్ని రద్దు చేసి రైతన్నల హక్కులను కాపాడిందన్నారు. భూమినే ప్రాణంగా భావించే రైతులకు ఎలాంటి భూసమస్యలు లేకుండా చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మంత్రి స్పష్టం చేశారు. అనంతరం "ఇంటింటికి తెలుగుదేశం పార్టీ" కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం రెండేళ్లలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ విజయాలను వివరించే కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలను ప్రజలకు వివరించి, వాటిని ప్రతి కుటుంబానికి చేరవేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

డీఎస్సీ అవకతవకలపై వైఎస్సార్సీపీ నిరసన.

- డీఎస్సీ నియామకాలపై సమగ్ర విచారణ జరపాలి: ఉషశ్రీ చరణ్



శ్రీ సత్యసాయి బ్యూరో, -03ఆగస్టు,(మహాప్రభ)

డీఎస్సీ నియామకాలలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గంలోని పరిగి మండల కేంద్రంలో సోమవారం వైఎస్సార్సీపీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ, టౌన్‌హాల్ సమావేశం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ నాయకత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు, నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ, డీఎస్సీ నియామకాలలో చోటుచేసుకున్న పరిణామాలు లక్షలాది మంది నిరుద్యోగ యువత భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మార్చాయని విమర్శించారు. ఉద్యోగాల కోసం ఎన్నో సంవత్సరాలుగా శ్రమించిన అభ్యర్థులకు ప్రభుత్వం న్యాయం చేయాల్సిన బాధ్యతను విస్మరించిందని ఆరోపించారు. డీఎస్సీ ఎంపిక ప్రక్రియలో పారదర్శకత పూర్తిగా లోపించిందని, అభ్యర్థులు వ్యక్తం చేస్తున్న సందేహాలు, అభ్యంతరాలకు ప్రభుత్వం ఇప్పటి వరకు స్పష్టమైన సమాధానం ఇవ్వలేదని అన్నారు. మొత్తం వ్యవహారంపై స్వతంత్ర, నిష్పాక్షిక విచారణ చేపట్టి అర్హులైన ప్రతి అభ్యర్థికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ అమలులో నిర్లక్ష్యం, నిరుద్యోగ భృతిపై స్పష్టత లేకపోవడం, విద్యార్థుల సంక్షేమ పథకాల అమలు నిలిచిపోవడం వంటి అంశాలను ప్రస్తావిస్తూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. విద్యార్థుల, నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం నిరంకుశ ధోరణితో వ్యవహరిస్తోందని ఆరోపించిన ఆమె, ఈ వ్యవహారానికి రాజకీయ బాధ్యత వహిస్తూ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ నియామకాలలో జరిగినట్లు ఆరోపిస్తున్న అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టి, అర్హులైన ప్రతి అభ్యర్థికి న్యాయం జరిగే వరకు వైఎస్సార్సీపీ నిరుద్యోగ యువతకు అండగా పోరాటాన్ని కొనసాగిస్తుందని ఉషశ్రీ చరణ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, యువజన విభాగం కార్యకర్తలు, నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

కాపు సామాజిక యువనేత ఉల్లి పెద్ద గుర్రప్ప కు వైసీపీ సోషల్ మీడియా బాధ్యతలు

- పార్టీకి ప్రధాన ఆయుధంగా సోషల్ మీడియా
- కాపు యువనేత ఉల్లి పెద్ద గురప్ప



శిరివెళ్ళ-03ఆగస్టు,(మహాప్రభ)

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు సోషల్ మీడియా రంగంలో విశేష అనుభవం ఉన్నటువంటి నవతరం యువనేత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న ప్రతిపక్షంలో ఉన్న డిజిటల్ రంగంలో ఏమాత్రం వెనుకడుగు వేయని ఉల్లిపెద్ద గుర్రప్పకు పార్టీ అధిష్టానం సోషల్ మీడియా బాధ్యతను అప్పగించింది. ఆళ్లగడ్డ మాజీ శాసనసభ్యులు గంగుల బిజేంద్రారెడ్డి సహకారంతో శిరివెళ్ల టౌన్ సోషల్ మీడియా ప్రధాన కార్యదర్శిగా పార్టీ అధిష్టానం నియమించినట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా ఉల్లి పెద్ద గుర్రప్ప మాట్లాడుతూ జగనన్న ఆదేశాల మేరకు ఆళ్లగడ్డ మాజీ శాసనసభ్యులు గంగుల బ్రిజేంద్ర రెడ్డి గారి సూచనల మేరకు పార్టీ కార్యక్రమాలను సోషల్ మీడియా వేదిక ద్వారా విశ్వవ్యాపితం చేసేందుకు తన వంతు కృషి చేస్తానని ఉల్లి పెద్ద గుర్రప్ప తెలియజేశారు. సుమారు పది సంవత్సరాలుగా జర్నలిస్టుగా సోషల్ మీడియా అనుభవం ఉన్న కాపు యువనేత గుర్రప్ప నేడు వైసీపీ సోషల్ మీడియ బాధ్యతలు చేపట్టడంతో ఆయన అభిమానులు శ్రేయోభిలాషులు పార్టీ వర్గాలు పెద్ద ఎత్తున హర్షం వ్యక్తం చేశారు. ప్రత్యక్షంగా కొందరు పరోక్షంగా ఫోన్ ద్వారా మరికొందరు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. శిరివెళ్ల మండల కేంద్రానికి చెందిన ఉల్లి పెద్ద గుర్రప్ప సోషల్ మీడియా వింగ్ సెక్రటరీగా పార్టీ అధిష్టానం నియమించడం పట్ల స్థానికుల్లో మరియు పార్టీ వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తం కావడం గమనార్హం. సోషల్ మీడియా అనుభవం ఉన్న వ్యక్తికి సరైన పోస్టింగ్ ఇచ్చి పార్టీ అధిష్టానం సముచిత న్యాయం చేసిందని పలువురు అభిప్రాయపడ్డారు.



ప్రచారం పటాటోపం



'దకద్రవ్య రహిత భారత్' లక్ష్యంగా వంద వారాల ప్రచారాన్ని 'నషా ముక్త్ యువ ఫర్ వికసిత భారత్ సంకల్ప్ అభియాన్'ను ప్రధానమంత్రి ఆదివారం వర్చువల్ గా ప్రారంభించారు. యాథా ప్రకారం 'అణిచేస్తాం... కోరలు పీకేస్తాం.. యువతను గుల్లచేస్తున్న మాదకద్రవ్యాలను అరికడతాం' అంటూ ప్రధానమంత్రి భీషణ ప్రతిజ్ఞలు చేశారు. అందులో యువత భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఆయన ప్రసంగం ఆద్యంతం ఆత్మస్తుతి పరనిందగానే సాగింది. 'యువతే మన దేశ భవిత అని తెలుసుకున్న శత్రు దేశాలు ఉగ్ర పన్నాగాల్లో భాగంగా మన భూభాగాల్లోకి మత్తు పదార్థాలను చేరవేస్తున్నాయి' అని ప్రధాని ఆరోపించారు. అదే నిజమైతే సరిహద్దు భద్రత, ఇంటెలిజెన్స్, సుంకాలు, ఓడరేవుల పర్యవేక్షణ అంతా కేంద్ర ప్రభుత్వ చేతుల్లోనే ఉన్నప్పుడు... మరి ఇన్ని వేల కిలోల మత్తు పదార్థాలు దేశంలోకి ఎలా రాగలుగుతున్నాయి? భద్రతా లోపాలను అంగీకరిం చకుండా కేవలం శత్రు దేశాలపై నెపం నెట్టడం ద్వారా పాలకులు తమ పరిపాలనా వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి ప్రయత్నించడమే. పెరుగుతున్న మత్తు పదార్థాల వినియోగం వెనుక ఉన్న అసలు సామాజిక-ఆర్థిక కారణాలను పాలక వర్గాలు సగం సత్యాలతో కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నాయి. యువతను కేవలం శాంతిభద్రతల సమస్యగా, చట్టవిరుద్ధ పనులకు పాల్పడే నేరస్థులుగా మాత్రమే చిత్రించడం ప్రభుత్వాల అలవాటుగా మారింది. మత్తు సంస్కృతి సమాజాన్ని కమ్మేస్తున్న వేళ, దానికి మూలకారణమైన వ్యవస్థాగత వైఫల్యాలను, కార్పొరేట్ లాభాల కోణాన్ని ప్రశ్నించాల్సిన బాధ్యత ప్రగతిశీల శక్తులపై ఉంది. మత్తు పదార్థాల వ్యాపారం అనేది నేడు వేల కోట్ల రూపాయల అంతర్జాతీయ కార్పొరేట్ నెట్ వర్క్ గా మారింది. దేశంలోని ఓడరేవులు, సరిహద్దుల గుండా వేల కిలోల డ్రగ్స్ దిగుమతి అవుతుంటే, ప్రధాన సూత్రధారులు, అదృశ్య దిగ్గజాలు సురక్షితంగా బయటపడుతున్నారు. చట్టం ప్రతిసారీ చిరు వ్యాపారులనో లేక, యువతనో జైళ్లలో పెట్టి చేతులు దులుపుకుంటోంది. బహుళజాతి డ్రగ్ మాఫియా, రాజకీయ-అధికార యంత్రాంగం మధ్య ఉన్న అపవిత్ర బంధాన్ని విచ్ఛిన్నం చేయకుండా కేవలం 'అవగాహనా సదస్సులు' నిర్వహించడం కేవలం తూతూమంత్రంగా చేసే కార్యక్రమం మాత్రమే అవుతుంది. అసలు యువత మత్తు వైపు ఎందుకు మళ్లుతోంది? దశాబ్దాలుగా అమలు జరుగుతున్న కార్పొరేట్ అనుకూల విధానాల వల్ల ప్రభుత్వ రంగాలు దెబ్బతిన్నాయి. నాణ్యమైన విద్య, ఉద్యోగ భద్రత కరువయ్యాయి. డిగ్రీ పట్టాలు చేతిలో ఉన్నా, గౌరవప్రదమైన ఉపాధి లేక కోట్లాది మంది యువత తీవ్ర నిరాశలో కూరుకుపోతోంది. మానసిక ఒత్తిడి, ఆందోళన, భవిష్యత్తుపై అభద్రతా భావంతో ఉన్న యువతను మత్తు పదార్థాల మాఫియా సులభంగా తమ వలలో వేసుకుంటోంది. నిరుద్యోగ రహిత సమాజాన్ని నిర్మించడంలో విఫలమైన వ్యవస్థే, యువతను ఈ ఊబిలోకి నెట్టివేసింది.'నషా ముక్త్ యువ' సాధన అనేది పోలీసుల లాఠీలతోనో, కఠిన చట్టాలతోనో సాధ్యమయ్యేది కాదు. మత్తుకు బానిసలైన యువతను శిక్షించాల్సిన నేరస్థులుగా కాక, ఈ లోపభూయిష్ట వ్యవస్థాగత బాధితులుగా చూడాలి. ఉచిత, నాణ్యమైన పునరావాస కేంద్రాలను ప్రభుత్వ రంగంలో విస్తృతంగా ఏర్పాటు చేయాలి. వైద్యం, కౌన్సెలింగ్ సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలి.

యువత శక్తిని మత్తు పదార్థాల ఊబి నుంచి కాపాడుకోవడం అంటే, ఈ వ్యవస్థ వైఫల్యాలపై ఉద్యమించడమే. ఉపాధి హక్కు, సామాజిక భద్రత కోసం సాగే పోరాటమే నిజమైన 'నషా ముక్త్' సమాజానికి పునాది.దేశంలోని ప్రధాన పోర్టులు, ప్రయివేట్ పోర్టుల ద్వారా టన్నుల కొద్దీ డ్రగ్స్ దేశంలోకి ముందెన్నడూ లేనంతగా దిగుమతి అవుతుంటే, ఆ అదృశ్య దిగ్గజాలపై కేంద్ర దర్యాప్తు సంస్థల ద్వారా కఠిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం ఎందుకు విఫలమవుతోంది. డ్రగ్స్ వ్యసనానికి గురైన యువతను శారీరక, మానసిక వైద్యం అందించాల్సిన 'బాధితులు'గా చూడకుండా, నేరస్థులుగా చిత్రీకరిస్తూ జైళ్లలో వేస్తున్నారు. మరోవైపు వేల కోట్ల రూపాయలు ఆర్జిస్తున్న పెద్ద పెద్ద డ్రగ్స్ సప్లై సిండికేట్లు సురక్షితంగా బయటపడుతున్నాయి. లాఠీలతో, ప్రతిజ్ఞలతో ఈ సమస్య తీరదు.వంద వారాలపాటు ప్రజలందరినీ భాగస్వాములను చేస్తూ.. ప్రతి ఆదివారం క్రీడలు, వాకథాన్, యోగ సెషన్స్, సాంస్కృతిక ప్రదర్శనలు, జాగృతి ప్రచారాలు, చర్చా వేదికలు, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తూ దేశవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రధాని పిలుపు నిచ్చారు. అసలు ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలను తీసుకోకుండా ఈ కార్య క్రమాల వలన వచ్చే ప్రయోజనం ఎంత? ఇదంతా ప్రచారం పటాటోపమే. వాస్తవానికి ప్రధాని మోడీ మార్గనిర్దేశంతో 'నషా ముక్త్ భారత్ అభియాన్' 2020లో ప్రారంభమైంది. అది అందించిన ఫలితాలు ఏమిటో ఇప్పటివరకు తెలియదు. కానీ, మరోసారి అట్టహాసంగా కోట్లు ఖర్చుపెట్టి కార్యక్రమానికి ప్రారంభించారు. మాదకా సురులపై ఉక్కుపాదం మోపుతామనే ప్రభుత్వాల మాటలు కొన్నేళ్లుగా కోటలు దాటుతూనే ఉన్నాయి. కానీ, పసలేని సర్కారీ చేతల పుణ్యమా అని మత్తుమందులు పప్పుబెల్లాలై ప్రతిచోటా గుట్టల కొద్దీ దొరుకుతున్నాయి. వీటి వలన ప్రయోజనాలు ఏపాటివి?

మెదక్ జిల్లాలో బీజేపీ ఓబీసీ మోర్చా పూర్తి కమిటీ ప్రకటన.

-కాషాయ జెండా ఎగురవేయడమే లక్ష్యం.

-జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్.



మెదక్ జిల్లా -03ఆగస్టు,(మహాప్రభ)

మెదక్ జిల్లా పార్టీ కార్యాలయంలో మెదక్ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఓబీసి మోర్చా మెదక్ జిల్లా అధ్యక్షుడు వడ్ల జనార్ధన్ అధ్యక్షతన ఓబీసీ మోర్చా మెదక్ జిల్లా పూర్తి కమిటీని అధికారికంగా ప్రకటించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు మెదక్ జిల్లా ప్రధాన కార్యదర్శులు సి ఎచ్ శ్రీనివాస్, ఈర్ల రంజిత్ రెడ్డి, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గడ్డం కాశీనాథ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు చిన్న రమేష్ గౌడ్, మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు శంకర్ గౌడ్, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రాగి రాములు, మెదక్ జిల్లా కార్యదర్శి కల్కి నాగరాజు, సాదుల అశోక్, మెదక్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శులు సుధాకర్ రెడ్డి, నల్లాల విజయ్, యం ఎల్ ఎన్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్, పాపన్నపేట మండల అధ్యక్షుడు వడ్ల సంతోష్ చారి, కొల్చారం మండల అధ్యక్షుడు హరీష్ గౌడ్, మెదక్ జిల్లా వాణిజ్య విభాగం కన్వీనర్ భిక్షపతి, నాగేష్ గౌడ్ మెదక్ జిల్లా సీనియర్ నాయకులు లోకేష్ అల్లం మధు, అంకం శ్రీను, సర్పంచులు యాదగిరి, రమేష్, చంద్రయ్య, మరియు బీజేపీ జిల్లా పదాధికారులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బీజేపీ మాత్రమే ఓబీసీలకు పెద్దపీట వేస్తోంది: జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ఈ సందర్భంగా మెదక్ జిల్లా బీజేపీ అధ్యక్షులు వాలుదాసు రాధా మల్లేష్ గౌడ్ గారు మాట్లాడుతూ... భారతీయ జనతా పార్టీ ఓబీసీలకు ఎప్పుడూ పెద్దపీట వేస్తోందని, ఓబీసీల అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపట్టి కృషి చేస్తోందని అన్నారు. సమాజంలో ఓబీసీలకు సముచిత గౌరవం ఇస్తున్న కేవలం ఏకైక పార్టీ భారతీయ జనతా పార్టీ మాత్రమేనని స్పష్టం చేశారు. నూతనంగా ఓబీసీ మోర్చా కార్యవర్గానికి ఎన్నికైన సభ్యులందరికీ ఆయన ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో మెదక్ జిల్లా గడ్డపై కాషాయ జెండా ఎగురవేయడమే మనందరి ప్రధాన లక్ష్యంగా ప్రతి ఒక్క కార్యకర్త సైనికులా పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు.

కొత్త ఆశలు రేపిన కుర్రకారు..!



కాక్రాచ్ జనతా పార్టీ (కేజేపీ) ఆందోళన ఒక పాఠాన్ని నేర్పింది. 79 సంవత్సరాల ప్రజాస్వామిక రాజకీయాలలో భారతీయ రాజకీయ పార్టీలు ఎప్పుడూ నేర్వని పాఠమది. ఈ ఏడాది మేనెల కాలంలో సదరు 'పాఠం' ప్రథమ సూచనలు సూక్ష్మంగా దృగ్గోచరమయ్యాయి. ఉద్యమాలు, పోరాటాల ద్వారా రాజకీయపార్టీలు మార్పును తీసుకువస్తాయని చరిత్ర ఇప్పటివరకు మనకు నేర్పింది. ఆ పాఠం ఇప్పటికీ ఒక సత్యం. వలసపాలన నుంచి భారత్ను విముక్తం చేసే ఉద్యమానికి భారత జాతీయ కాంగ్రెస్ నాయకత్వం వహించింది. స్వాతంత్ర్యం విజయం సాధించింది. భారత గణతంత్ర రాజ్యాన్ని వ్యవస్థాపించింది. దశాబ్దాలపాటు వరుసగా ఎన్నికలలో విజయాలు సాధించింది. రాజ్యాంగబద్ధ పాలన, లౌకికవాదం, రిజర్వేషన్లు, భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటు, స్వతంత్ర కేంద్ర బ్యాంకు, అధికారాల బదిలీ, ఆర్థిక వనరుల పంపిణీ మొదలైన వాటితో భారత ప్రజాస్వామ్యానికి సుదృఢ పునాదులు నిర్మించింది. ప్రాంతీయ పార్టీలు--ద్రవిడ పార్టీలు వేరొక ఉదాహరణ. ఆయా రాష్ట్రాల ఎన్నికల్లో విజయాలు సాధిస్తూ రాష్ట్ర ప్రజల మాతృభాషకు, రాష్ట్ర హక్కులకు, సాంస్కృతిక అస్తిత్వానికి, భూ సంస్కరణలు మొదలైన వాటికి ప్రాధాన్యమిస్తూ వస్తున్నాయి. లోక్ నాయక్ జయప్రకాష్ నారాయణ్ నాయకత్వంలో జరిగిన ఉద్యమం కేంద్రంలో తొలి కాంగ్రెసేతర ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకువచ్చి పౌర స్వేచ్ఛలకు రాజ్యాంగబద్ధ రక్షణలు కల్పించింది. ఆల్ అస్సోం స్టూడెంట్స్ యూనియన్ మూవ్మెంట్ దేశ సరిహద్దుల వెలుపల నుండి అక్రమంగా జరుగుతున్న వలసలను అరికట్టే చట్టాల నిర్మాణానికి దారితీసింది. భారతదేశ పరిపాలనలో ప్రధాన మార్పులు అన్నిటినీ రాజకీయ పార్టీలే ఉద్యమాలు, పోరాటాలు, ఎన్నికల ద్వారా సాధించాయి. కాక్రాచ్ జనతా పార్టీ సంప్రదాయమైన రీతి రివాజల ప్రకారం ఒక రాజకీయ పక్షం కాదు. అభిజిత్ దీప్ అనే ఒక యువకుడి ఆగ్రహపూరిత ప్రతిస్పందన నుంచి సీజేపీ ఉద్భవించింది. ఉన్నత న్యాయవ్యవస్థలోని ఒక పెద్ద మనిషి చేసిన రెచ్చగొట్టే వ్యాఖ్య అభిజిత్కు, ఆయన స్నేహితులకు మనస్తాపం కలిగించింది. ఇన్స్టాగ్రామ్ మాధ్యమంగా అభిజిత్ ఒక డిజిటల్ వేదికను ప్రారంభించి 'కాక్రాచ్లు అన్ని సంఘటితమైతే ఏం జరుగుతుంది?' అని ప్రశ్నించాడు. 'నిరుద్యోగులు, బాధితులు నిరంతరం ఆన్లైన్లో ఉండేవారు, సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను వృత్తిపరమైన అవగాహనతో నిశితంగా విశ్లేషించగలవారు ఎవరైనా ఈ డిజిటల్ సమూహంలో చేరవచ్చని ఆయన ఆహ్వానించాడు. విద్యార్థులు, సాఫ్ట్వేర్లో సహా ఈ అసాధారణ అర్హతలు ఉన్నవారు అసంఖ్యాకంగా ఉన్నారు. ఉద్యోగం లేదా వృత్తిలో నిరంతరం ఆన్లైన్లో ఉంటూ, సమస్యలపై అవగాహనతో వాదించగల ప్రతిభావంతులు చాలామంది ఉన్నారు. వీరిలో కళాకారులు, ఉపాధ్యాయులు, డాక్టర్లు, నర్సులు, న్యాయవాదులు, వ్యాపారవేత్తలు, పాత్రికేయులు, జూనియర్ ప్రభుత్వోద్యోగులు తదితర గౌరవనీయ స్త్రీ పురుషులు సంఖ్యాతిశయంగా ఉన్నారు.

కాక్రాచ్ జనతా పార్టీకి ఒక వ్యవస్థాపక నాయకుడు ఉన్నారు, అధికార ప్రతినిధులు ఉన్నారు. పట్టణాల, డిస్ట్రిక్ట్ శాఖలు ఉన్నాయి. అంతకుమించి మరేమీ లేవు. సీజేపీకి సంస్థాగత నిర్మాణం లేదు, సభ్యత్వం లేదు. అధికారికంగా నమోదు కాని పార్టీ అది. విధానాల ప్రకటన జరగలేదు. ఒక రాజకీయ పక్షానికి ఉండే లక్షణాలు ఏవీ దానికి లేవు. అయినప్పటికీ 35 రోజుల నిరసనలో ఇద్దరు కేంద్ర కేబినెట్ మంత్రులు తమతో సంప్రదింపులు జరిపేలా ఒత్తిడి తెచ్చింది. తాము లక్ష్యంగా చేసుకున్న మంత్రి రాజీనామాను సాధించింది. నిరసనకారులపై ప్రభుత్వ కేసులను ఉపసంహరించు చేయడంలో విజయవంతమైంది. ప్రభుత్వం నుంచి లిఖిత పూర్వక హామీలు పొందింది. ఇదంతా మున్సిపల్గా జరిగింది.

నేను మొట్టమొదటనే చెప్పినట్టు రాజకీయ పార్టీలకు అతీతమైన అటువంటి రాజకీయ ప్రదేశం 2026లో తమిళనాడులో కనిపించింది. సినీ నటుడు జోసెఫ్ విజయ్ 2024 ఫిబ్రవరిలో ఒక రాజకీయ పార్టీ (తమిళగ వెట్రి కళగం--టీవీకే)ను స్థాపించారు. అయితే ఇది ఒక క్రమబద్ధమైన రాజకీయ పార్టీ స్వరూప స్వభావాలను సంతరించుకోలేదు; అది ఒక అవ్యవస్థిత అభిమానుల సంఘంగా మాత్రమే ఉన్నది. ఈ అభిమానుల సంఘం సభ్యులే వివిధ స్థాయిలలో టీవీకే కార్యాచరణాత్మక వర్గ సభ్యులుగా ఉన్నారు. సాంప్రదాయక రాజకీయ వివేకానికి విరుద్ధ పద్ధతులలో అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేసి ఆశ్చర్యాలను ఎంపిక చేశారు. కులం, మతం, జెండర్, కుటుంబ వారసత్వాలు, ఆస్తులు మొదలైన అంశాలను పరిగణనలోకి తీసుకోకుండానే ఆ ఎంపిక జరిగింది. 234 మంది అభ్యర్థులలో 200 మందికి ప్రచార వ్యయాలకు అవసరమైన సొమ్ము కనీసంగా కూడా లేదు. నిజానికి వారు ప్రచారమనేదే చేయలేదు. టీవీకే అభ్యర్థులలో చాలామంది తాము పోటీ చేసే నియోజకవర్గ ప్రజలకు పూర్తిగా అపరిచితులు. పోలింగ్ బూత్ ఏజెంట్లు గానీ, పోలింగ్ ఏజెంట్లు గానీ, కౌంటింగ్ ఏజెంట్లు గానీ వారికి కనీస సంఖ్యలో కూడా లేరు. విజయ్ రోడ్ షోలు నిర్వహించారు. కొన్ని సమావేశాలలో ప్రసంగించారు. ఓటర్లు పట్టించుకున్నదల్లా 'విజయ్', ఆయన పార్టీ ఎన్నికల చిహ్నమైన 'విజిల్' మాత్రమే. అయితే సోషల్ మీడియా ద్వారా విజయ్, ఆయన పార్టీ ప్రజలకు సన్నిహితమయ్యారు. ప్రతీ చోటా, ప్రతీ కుటుంబంలోను విజయ్ గురించి మాట్లాడుకున్నారు. అన్నివిధాలా బలోపేతమైన ప్రభుత్వ పక్షాలే టీఎంకే, అన్నా డీఎంకేలను ఎదుర్కొని టీవీకే 108 స్థానాలలో విజయం సాధించింది. 35శాతం ఓట్లను కైవసం చేసుకున్నది. టీవీకే విజయాన్ని ఏ రాజకీయ పార్టీ ఊహించలేదు. ఏ రాజకీయ నాయకుడూ కలలోనైనా అనుకోలేదు. ఏ పాత్రికేయుడూ పౌరసమాజం కూడా అభిప్రాయపడలేదు. ఓజిళ్లు సర్వేలు నిర్వహించే నిపుణులలో ఏ ఒక్కరూ సూచనమాత్రంగానైనా చెప్పలేదు. తమిళనాడులో ఆ అద్భుత రాజకీయ మార్పును, రాజకీయ పార్టీలతో నిమిత్తం లేకుండా పౌరులే సాధించారు. టీవీకే గెలుపు పౌర వివేకానికి విజయం. పరస్పర పరిచయం లేని, ఒకరితో ఒకరు మాట్లాడుకోని ఓటర్లు ఒకే తీరున ఓటు వేసి రాజకీయ మార్పు తీసుకువచ్చారు. ప్రభవిస్తున్న కొత్త పౌర చైతన్యంలో అటువంటి మినహాయింపుల రాజకీయ పరివర్తనలు అసాధ్యమేమీ కాదు. తమిళనాడులో ఎన్నికల ఫలితాల అసూయా పరిణామాల్ని జంతర్ మంతర్ నిరసన పర్యవసానాలను రాజకీయ పార్టీలు నిష్పాక్షికంగా పరిశీలించాలి. సువ్యవస్థిత రాజకీయ పార్టీలు కాలం చెల్లిపోయినవిగా కాకపోవచ్చు కానీ, హై కమాండ్, ఎగ్జిక్యూటివ్ కమిటీ, జనరల్ కౌన్సిల్, మహాసభ, సభ్యత్వం, పార్టీ సంస్థాగత ఎన్నికలు మొదలైనవి అనవసరమైనవి కావచ్చు. 'ఓటు బ్యాంక్' అనే పదం మటుమాయం కావచ్చు. మొబైల్ ఫోన్, ట్విట్టర్ (ఎక్స్), ఫేస్బుక్, ఇన్స్టాగ్రామ్ పుణ్యమా అని మోసాన్ని వీడిన పౌరులు ఇప్పుడు భయాందోళనలు పూర్తిగా సృష్టి చేస్తున్నట్టు కనిపిస్తోంది. పోలీసులు, లాఠీలు, టియర్ గ్యాస్, తుపాకులు, అరెస్టులు, నిర్బంధాలు యువజనులను ఎంతమాత్రం భయపెట్టడం లేదు. వయోజనులు, సీనియర్ పౌరులూ యువతనే అనుసరించడం ఖాయం. రాజకీయ పార్టీలకు అతీతమైన రాజకీయ ప్రదేశం మరింత విస్తృతమౌతుందని నేను కోరుకుంటున్నాను. జెన్--జీ, ఇతర నిరసనకారుల ఎదుట అతి ముఖ్యమైన కర్తవ్యాలు కొన్ని ఉన్నాయి: తొలుత విశ్వవిద్యాలయాల మధ్యయుగాల మనస్తత్వాలు, సంస్కరణ వ్యతిరేక ధోరణుల నుంచి విముక్తం చేయాలి; కొంతమంది వ్యక్తులు ధర్మం, సంస్కృతి పేరిట ఇతరుల వ్యక్తిగత స్వేచ్ఛను నిరోధించే మోరల్ పోలీసింగ్ను, పోలీసుల క్రూర పద్ధతులకు, బజరంగ్దళ్ లాంటి సంస్థలకు వ్యతిరేకంగా పోరాడాలి; స్థానిక రెవెన్యూ, రిజిస్ట్రేషన్ కార్యాలయాలు, ఆసుపత్రులు, రేషన్ దుకాణాలు, స్థానిక స్వపరిపాలనా సంస్థలు మొదలైన వాటిలో అవినీతిపై పోరాడాలి. నేరుగా, మెరుగైన మార్పు ప్రతిదీ సుసాధ్యమేనన్న భావన జంతర్ మంతర్ ఆందోళన అనంతరం కలుగుతోంది.

ముగిసిన ధరఖాస్తుల స్వీకరణ



నారాయణఖేడ్,ఆగస్టు 3 (మహాప్రభ): అంగన్వాడీ టీచర్ మరియు ఆయా పోస్టుల దరఖాస్తు స్వీకరణ జులై 31వ తేదీతో ముగిసిందని సిడిపిఓ సుజాత తెలిపారు.సోమవారం ఆమె ఒక ప్రకటనలో నారాయణఖేడ్ డివిజన్ లో 34 టీచర్,122 ఆయా పోస్టులు ఖాళీ ఉండగా,టీచర్ కు 664 మంది, ఆయాకు 531 మంది దరఖాస్తు చేసుకున్నారు అన్నారు.ప్రభుత్వ నిబంధనలు,ఆదేశాల మేరకు ఉద్యోగాల భర్తీ ఉంటుంది అన్నారు.

బీజేపీ OBC మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా సిహెచ్ అశోక్



నిజాంపేట, ఆగస్టు 3 (మహాప్రభ): మెదక్ జిల్లా నిజాంపేట మండలానికి చెందిన సిహెచ్ అశోక్ను భారతీయ జనతా పార్టీ గాదీజ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించారు. జిల్లా అధ్యక్షుడు వోల్దాస్ మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో జిల్లా గాదీజ మోర్చా అధ్యక్షుడు వడ్ల జనార్దన్ ఈ నియామకాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా సిహెచ్ అశోక్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన మెదక్ ఎంపీ, పార్టీ జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతంతో పాటు ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేసేందుకు కృషి చేస్తానని అన్నారు.

అక్రెడిటేషన్ కమిటీల్లో టీడబ్ల్యూజేఎఫ్‌కు ప్రాతినిధ్యం ఇవ్వాలి

-రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ హైకోర్టు కీలక ఆదేశాలు
-జర్నలిస్టుల హక్కులకు మరోసారి న్యాయస్థానం అండ
-ఇది మా టీడబ్ల్యూజేఎఫ్ సభ్యుల విజయం
-రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య



హైదరాబాద్, ఆగస్టు 03.(మహా ప్రభ)
రాష్ట్రంలోని అన్ని జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీ (డీఎంఏసీ)ల్లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్)కు ప్రాతినిధ్యం కల్పించాలని తెలంగాణ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. మీడియా అక్రెడిటేషన్ కమిటీల ఏర్పాటు విషయంలో జర్నలిస్టు సంఘాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరాన్ని హైకోర్టు స్పష్టం చేసింది. అన్ని అర్హతలున్న టీడబ్ల్యూజేఎఫ్ కు అక్రెడిటేషన్ కమిటీల్లో ప్రాతినిధ్యం ఇవ్వకపోవడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. రాష్ట్ర ప్రభుత్వం జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీలను ఏర్పాటు చేసే సమయంలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్‌కు ప్రాతినిధ్యం ఇవ్వకుండా వ్యవహరించడాన్ని సవాల్ చేస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు దాఖలైన రిట్ పిటిషన్‌పై గత ఆరు నెలలుగా పలుమార్లు విచారణ జరిగింది. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్ కార్యాలయ న్యాయవాదులు, పిటిషనర్ తరఫున న్యాయవాదులు తమ వాదనలు కోర్టు ముందు వినిపించారు.ఇరుపక్షాల వాదనలు, ప్రభుత్వ ఉత్తర్వులు, మీడియా అక్రెడిటేషన్ కమిటీల ఏర్పాటు విధానం, జర్నలిస్టు సంఘాల ప్రాతినిధ్యానికి సంబంధించిన నిబంధనలను పరిశీలించిన అనంతరం తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, జస్టిస్ మొహినుద్దీన్‌ల ధర్మాసనం సోమవారం తీర్పును వెలువరించింది. రాష్ట్రంలోని అన్ని జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీల్లో టీడబ్ల్యూజేఎఫ్‌కు కూడా తగిన ప్రాతినిధ్యం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ తీర్పుతో రాష్ట్రంలోని జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీల్లో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్‌కు అధికారిక ప్రాతినిధ్యం లభించే మార్గం సుగమమైంది. జర్నలిస్టు సంఘాల మధ్య సమాన అవకాశాలు, పారదర్శకత, న్యాయబద్ధమైన ప్రాతినిధ్యానికి ఈ తీర్పు దోహదపడుతుందని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. హైకోర్టు తీర్పును తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర నాయకత్వం హర్షం వ్యక్తం చేస్తూ స్వాగతించింది. జర్నలిస్టుల హక్కులు, గౌరవం, సంఘాలకు సమాన ప్రాతినిధ్యం కల్పించాలన్న తమ పోరాటానికి ఇది న్యాయపరమైన విజయమని పేర్కొంది. ఈ తీర్పును వెంటనే అమలు చేసి, అన్ని జిల్లా మీడియా అక్రెడిటేషన్ కమిటీల్లో టీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులను నియమించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సంఘం నాయకులు కోరారు.
ఈ తీర్పు భవిష్యత్తులో మీడియా అక్రెడిటేషన్ కమిటీల ఏర్పాటులో అన్ని గుర్తింపు పొందిన జర్నలిస్టు సంఘాలకు సముచిత ప్రాధాన్యం కల్పించేలా మార్గదర్శకంగా నిలుస్తుందని జర్నలిస్టు వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. న్యాయం, ధర్మం తమవైపు ఉందని, హైకోర్టు ఇచ్చిన తీర్పు తమ సంఘం సభ్యుల విజయం అని రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య పేర్కొన్నారు.

శ్రీ చైతన్య పాఠశాల ఇన్వెస్టిచర్ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్న గడ్డిఅన్నారం మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్.





గడ్డి అన్నారం -3 ఆగస్టు (మహాప్రభ)
గడ్డి అన్నారం బ్రాంచ్‌లోని శ్రీ చైతన్య పాఠశాలలో నిర్వహించిన ఇన్వెస్టిచర్ స్టూడెంట్ లీడర్షిప్ వేడుకలకు గడ్డిఅన్నారం డివిజన్ మాజీ కార్పొరేటర్ భవాని ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల స్థాయి ఎన్నికల్లో విజయం సాధించిన విద్యార్థి నాయకులతో పాటు వివిధ విద్యా, సాంస్కృతిక, క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆయన చేతుల మీదుగా ప్రశంస పత్రాలు, బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా భవాని ప్రవీణ్ కుమార్ గారు మాట్లాడుతూ, నేటి బాలలే రేపటి ఉత్తమ పౌరులు, సమర్థ నాయకులు. విద్యార్థి దశ నుంచే ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుతమైన ఆలోచనా విధానాన్ని పెంపొందించడం అత్యంత అవసరం. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంచి, భవిష్యత్తులో సమాజానికి సేవ చేసే నాయకులుగా తీర్చిదిద్దుతాయి అని పేర్కొన్నారు. విద్యార్థుల్లో నాయకత్వ పటిమను వెలికితీసే లక్ష్యంతో ఇన్వెస్టిచర్ కార్యక్రమాన్ని నిర్వహించిన శ్రీ చైతన్య పాఠశాల యాజమాన్యానికి, ప్రిన్సిపాల్‌కు, ఉపాధ్యాయ బృందానికి ఆయన ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గడ్డిఅన్నారం డివిజన్ బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు, పార్టీ ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రీ ప్రైమరీ పిల్లలకు పుస్తకాలు, పలకలు పంపిణీ

-ఎంఈఓ శ్రీహరి, సర్పంచ్ సువర్ణ ఆధ్వర్యంలో పుస్తకాల పంపిణీ



గాంధారి, ఆగస్టు 03 మహాప్రభ
మండల గౌరారం ప్రాథమిక పాఠశాలలోని ప్రీ ప్రైమరీ కేంద్రంలో 18 మంది విద్యార్థినీ, విద్యార్థులకు పుస్తకాలు, పలకలను మండల విద్యాశాఖ అధికారి శ్రీహరి, సర్పంచ్ సువర్ణ అనిల్ గౌడ్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రతిరోజూ క్రమం తప్పకుండా పాఠశాలకు రావాలని, వ్యక్తిగత పరిశుభ్రత, సమయపాలన పాటించేలా తల్లిదండ్రులు సహకరించాలని ఉప సర్పంచ్ గాజుల కృష్ణమూర్తి కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పౌష్టికాహారంతో పాటు సరళమైన పద్ధతిలో విద్యను అందిస్తామని ప్రధానోపాధ్యాయులు రాములు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సరిత, పెంటయ్య, సత్యనారాయణ, నవనీత, విద్యార్థులు పాల్గొన్నారు.

తహసీల్దార్ పనితీరుపై అసంతృప్తి



కోటగిరి / పోతంగల్ -03ఆగస్ట్ (మహాప్రభ)
పోతంగల్ మండల కేంద్రంలోని మండల తాహసిల్దార్ పనితీరుపై స్థానిక నాయకులు ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం రోజున స్థానిక నాయకులు ప్రజలు తాసిల్దార్ కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడుతూ భూ సమస్యలు ధ్రువపత్రాల జారీ దరఖాస్తుల పరిష్కారం వంటి అనేక పనులు సకాలంలో పూర్తి కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తులు పెండింగ్‌లోనే ఉంటున్నాయని దీంతో కార్యాలయానికి వచ్చే ప్రజలు నిరాశతో వెనుదిరుగుతున్న పరిస్థితి నెలకొన్నట్లు తెలిపారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని పరిస్థితిని సమీక్షించి అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు బిజెపి మండల ప్రెసిడెంట్ హన్మండ్లు రమేష్ సెట్ సజ్జత్ శివరాజ్ పటేల్ శేఖర్,గంగారం సంజీవ్ పటేల్ భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ నిధి రుణాల్లో రూ.18 లక్షల అక్రమాలు.

-విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని మహిళల వినతి



మెదక్ ఆగస్టు 3(మహాప్రభ)
టేక్మల్ మండలం టేక్మల్ గ్రామ పంచాయతీ పరిధిలోని గొల్లగూడెం గ్రామ మహిళా సమాఖ్య సభ్యులు స్త్రీ నిధి ఖాతాల్లో తమకు తెలియకుండా అక్రమంగా రుణాలు తీసుకుని నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆరోపిస్తూ సోమవారం మెదక్ కలెక్టరేట్ కార్యాలయానికి వచ్చి ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంబంధిత వివో ఏపై శాఖాపరంగా, చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కనకదుర్గ, మహేశ్వరి, మల్లేశ్వరి, మల్లికార్జున, నల్ల పోచమ్మ, సంతోషిమాత, వీరహనుమాన్, విజయలక్ష్మి తదితర సంఘాలకు చెందిన సభ్యుల పేర్లపై వారి ప్రమేయం లేకుండానే 2023లో స్త్రీ నిధి రుణాలు మంజూరు చేసినట్లు ఇటీవల తెలిసిందన్నారు. తమకు చదువు రాకపోవడాన్ని ఆసరాగా తీసుకుని, తమ పేర్లపై తీర్మానాలు రూపొందించి సంతకాలను ఫోర్జరీ చేసి రుణాలు తీసుకున్నారని ఆరోపించారు.ఈ వ్యవహారంలో బురుజుకింది ఇందిర, సాదు పోచమ్మ, సాదు సునంద, గంగమ్మ, కుర్మ మానెమ్మ, కుర్మ పోచమ్మ, గొల్ల సాయమ్మ, సొంగ గంగమ్మతో పాటు మరికొందరు బాధితులుగా ఉన్నట్లు పేర్కొన్నారు. స్త్రీ నిధి రుణాలతో పాటు జ×ళీ, వెలుగు గ్రామ సంఘం నిధులు కలిపి సుమారు రూ.18 లక్షల మేర అక్రమాలు జరిగినట్లు ఆరోపించారు.ఈ అవకతవకలకు గ్రామ వివో ఏ ఆంజనేయులు బాధ్యులని ఆరోపించిన మహిళలు, సంబంధిత సంఘాల బ్యాంకు ఖాతాల లావాదేవీలను పూర్తిస్థాయిలో విచారించి, నిధుల దుర్వినియోగంపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే తమకు న్యాయం చేసి ఆర్థిక నష్టాన్ని భర్తీ చేస్త్రీ నిధి రుణాల్లో రూ.18 లక్షల అక్రమాలు. వివోఏపై చర్యలు తీసుకోవాలని మహిళల వినతి

బలమైన భవిష్యత్తుకు తల్లిపాలే పునాది.

-ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను విజయవంతం చేయాలి.
-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్.



మెదక్ జిల్లా,-03,ఆగస్ట్ (మహాప్రభ)
ఆగస్టు 1వ తేదీ నుంచి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్న ప్రపంచ తల్లి పాల వారోత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్ ప్రతిమా సింగ్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల ఉత్సవాల పోస్టర్స్ ను అదనపు కలెక్టర్ నగేష్ తో కలసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి తల్లి తన బిడ్డకు జన్మనిచ్చిన గంటలోపే తల్లిపాలు అందించాలని తెలిపారు. తల్లిపాలు శిశువుకు సురక్షితమైనవి, స్వచ్ఛమైనవి, పోషక విలువలు కలిగినవని, శిశువు ఆరోగ్యవంతంగా ఎదగడానికి తల్లిపాలే బలమైన పునాదిగా నిలుస్తాయని పేర్కొన్నారు. బిడ్డల బంగారు భవిష్యత్తు కోసం తల్లిపాలు ఎంతో అవసరమని, కనీసం ఆరు నెలల నుంచి ఒక సంవత్సరం వరకు తప్పనిసరిగా తల్లిపాలు అందించాలని సూచించారు. తల్లిపాలు అందించడం ప్రతి బిడ్డ హక్కు అని, ప్రతి తల్లి తన మాతృత్వ బాధ్యతను గుర్తించి పిల్లలకు తల్లిపాలు అందించాలని కోరారు. తల్లులు తీసుకునే పోషకాహారం ద్వారానే స్వచ్ఛమైన పాలు బిడ్డలకు అందుతాయని, దీంతో పిల్లలు ఆరోగ్యంగా, దృఢంగా ఎదుగుతారని తెలిపారు. బలమైన బాల్యానికి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి తల్లిపాలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాల సందర్భంగా అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది తల్లులను ప్రోత్సహించి, ప్రతి శిశువుకు తల్లిపాలు అందేలా విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న తల్లి పాల వారోత్సవాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. తల్లులందరికీ ప్రపంచ తల్లి పాల వారోత్సవాల శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదరపు కలెక్టర్ నగేష్ డీ డబ్ల్యూ హేమ భార్గవి, డిసి.హెచ్.ఎస్ శివదయాల్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డి ఆర్ డి ఓ శ్రీనివాసరావు, డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, ఏ ఎం ఓ రాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి గణేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన సదస్సు

-బేటీ బచావో కార్యక్రమంలో మహిళా చట్టాలపై అవగాహన
- సుకన్య సమృద్ధి యోజనపై సర్పంచ్ హామీ



గాంధారి, ఆగస్టు03 (మహాప్రభ)
మండలం గౌరారం గ్రామంలోని అంగన్వాడి సెంటర్‌లో సోమవారం బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా జిల్లా మహిళా సాధికారిక సిబ్బంది తులసి మాట్లాడారు. పిల్లల చట్టాలు, బాల్య వివాహాల నిర్మూలన, ఆడపిల్లల చదువు ప్రాముఖ్యత, మహిళల చట్టాలు, సేవలు, తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు. హెల్ప్‌లైన్ నంబర్లు 181, 100, 1098, 112, మరియు సుకన్య సమృద్ధి యోజన గురించి అంగన్వాడి లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, గౌరారం గ్రామంలోని ప్రతి ఆడపిల్లతో సుకన్య సమృద్ధి యోజన ఖాతా తెరిపిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, సెక్రటరీ, ఎంఎల్ హెచ్ పి డాక్టర్, అంగన్వాడీ టీచర్, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు, అంగన్వాడి లబ్ధిదారులు పాల్గొన్నారు.

రామాయంపేటలోని NH-44 పై హోటల్ అడిగాస్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో 15 మంది స్కూల్ చిన్నారులు, ఉపాధ్యాయులు

రామాయంపేట ఆగస్టు 3 మహాప్రభ
గాయపడిన విషయం తెలుసుకున్నారు.
ఈ ఘటనపై స్పందించిన గౌరవనీయులు మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు గారు తక్షణమే పోలీస్ అధికారులతో ఫోన్ లో మాట్లాడారు. గాయపడిన వారందరికీ తక్షణమే మెరుగైన వైద్య సహాయం అందేలా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని, వారి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆయన అధికారులను ఆదేశించారు. గాయపడిన చిన్నారులు త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు.
రామాయంపేట NH-44 హైవే రోడ్డుపై. ప్రమాదం



హోటల్ అడిగాస్ ఎదురుగా ఆటో ఢీకొన్న లారీ జరిగిన ప్రమాదంలో 15 మంది మోడల్ స్కూల్ చిన్నారులు, టీచర్లు గాయపడ్డారు. వెంటనే స్థానికులు 108 ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు
అనంతరం కొందరిని ప్రైవేట్ ఆస్పత్రులకు తీసుకెళ్లారు వెంటనే స్పందించిన మెదక్ ఫ్లో మాధవనేని రఘునందన్ రావు గారు గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.
త్వరగా కోలుకోవాలని ప్రార్థనలు

ప్రజావాణిలో కొత్తపేట ప్రజా సమస్యలపై వినతిపత్రం సమర్పించిన మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్.



హయత్‌నగర్ – ఆగస్టు 3 (మహాప్రభ)
ఈరోజు హయత్‌నగర్ జలమండలి కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కొత్తపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ ప్రజా సమస్యలకు సంబంధించిన వినతిపత్రాన్ని సీజీఎం నాగేందర్ కి సమర్పించారు.
ఈ సందర్భంగా కొత్తపేట డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన పాత డ్రైనేజ్ పైప్‌లైన్ల కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. సంబంధిత ప్రాంతాలను అధికారులు వెంటనే పరిశీలించి నూతన డ్రైనేజ్ పైప్‌లైన్లను ఏర్పాటు చేయాలని కోరారు.
నూతన డ్రైనేజ్ పైప్‌లైన్లు ఏర్పాటు చేయాల్సిన ప్రాంతాలు
జైన్ మందిర్ లైన్ నుండి సంతోష్ మెడికల్ హాల్ వరకు
నాగేశ్వరరావు కాలనీ
మారుతి నగర్ రోడ్ నెం. 4 మెయిన్ రోడ్
సత్యనగర్
గాయత్రిపురం ఎస్ఆర్ఎల్ కాలనీ రోడ్ నెం. 13
అదేవిధంగా, కమర్షియల్ టాక్స్ కాలనీ రోడ్ నెం. 1 మరియు ఆర్‌బీఐ కాలనీ మానస ఎన్‌క్లేవ్ ప్రాంతాల్లో తక్కువ నీటి ఒత్తిడి లో వాటర్ ప్రెషర్ కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొంటూ, తక్షణమే తాగునీటి సరఫరాను మెరుగుపరిచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.
అలాగే న్యూ మారుతి నగర్లోని రోడ్ నెం. 3 ఇ, 7, 7ూ ప్రాంతాల్లో సుమారు 40 సంవత్సరాల క్రితం వేసిన తాగునీటి పైప్‌లైన్లు తరచూ కలుషితమవుతూ ప్రజల ఆరోగ్యానికి ఇబ్బందులు కలిగిస్తున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతాలకు నూతన తాగునీటి పైప్‌లైన్లను మంజూరు చేసి, పనులను వీలైనంత త్వరగా ప్రారంభించాలని జలమండలి అధికారులను కోరారు. ప్రజల మౌలిక సదుపాయాల సమస్యల పరిష్కారానికి తాము నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా నాయకోటి పవన్ కుమార్ తెలిపారు.

దేవరకొండలో ఎం జి ఎలక్ట్రికల్ స్కూటీ షాప్‌ను ప్రారంభించిన దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్



దేవరకొండ ఆగస్టు 3 (మహా ప్రభ)
దేవరకొండ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎం.జిఎలక్ట్రికల్ స్కూటీ షాప్‌ను దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా షాప్ యజమానులకు శుభాకాంక్షలు తెలియజేసి, వ్యాపారం విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....ప్రస్తుతం పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం రోజురోజుకు పెరుగుతోందని అన్నారు. ఇంధన ధరల పెరుగుదల నేపథ్యంలో ఎలక్ట్రిక్ స్కూటీలు ప్రజలకు ఆర్థికంగా ప్రయోజనకరంగా ఉండటమే కాకుండా, కాలుష్యాన్ని తగ్గించడంలో కూడా కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. దేవరకొండలో ఇటువంటి ఆధునిక సేవలు అందుబాటులోకి రావడం స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరమని, యువత స్వయం ఉపాధి దిశగా ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరిగి, వ్యాపార రంగం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పొట్ట మురళి, పొట్ట మధు, సర్పంచ్ ఆదారపు హరికృష్ణ,బొడ్డుపల్లి కృష్ణ ,ఇలియాస్ పటేల్,మాడం రాములు, ముదిగొండ హరిదాస్, అఫ్రోజ్, అంజి, శ్రీనివాస్,యజమానులు గండూరి లక్ష్మణ్,సాగర్,పార్టీ నాయకులు యువకులు

తల్లిపాల వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ



దేవరకొండ ఆగస్టు 3 (మహా ప్రభ)
సోమవారం ఆర్ డి ఓ కార్యాలయం దేవరకొండ లో ప్రజావాణి అనంతరం అడిషనల్ కలెక్టర్ ఎన్ పవన్ కుమార్ మరియు ఆర్ డి ఓ పద్మ ప్రియ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల పోస్టర్ను ఆవిష్కరించడం జరిగింది, ఈ కార్యక్రమంలో ఆర్డిఓ పద్మప్రియ మాట్లాడుతూ ప్రసవానికి దగ్గరలో ఉన్న ప్రతి గర్భిణీ కుటుంబాన్ని సందర్శించి గర్భిణీ స్త్రీకి మరియు కుటుంబ సభ్యులందరికీ కూడా తల్లిపాల ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించాలి అనిఅన్నారు. బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాల ను ఇప్పించాలి అలాగే ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలన మాత్రమే ఇవ్వాలని ఆమె అన్నారు. తల్లిపాలలో వ్యాధి నిరోధక శక్తి పిల్లలకి ఐక్యూ లెవెల్స్ (జ్ఞాపకశక్తి) పెరుగుతుందని తెలియపరిచారు, ఈ కార్యక్రమంలో ఏసీడీపీఓ నిర్మలా , టీచర్స్, వి.పద్మ. బాల మాణి. పద్మ. జ్యోతి. తదితరుల పాల్గొన్నారు

పోతంగల్ లో నేడు బోనాల పండుగ



కోటగిరి / పోతంగల్
-03ఆగస్ట్ (మహాప్రభ)
పోతంగల్ మండల కేంద్రంలో నేడు నిర్వహిస్తున్న బోనాల పండుగ మహోత్సవం సందర్భంగా గ్రామ ప్రజలందరికీ కల్లూరు సంధ్య హన్మండ్లు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అమ్మవారి కటాక్షంతో ప్రతి ఇంటా సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు వెల్లివిరియాలని అమ్మవారిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. గ్రామ ప్రజలందరూ భక్తి శ్రద్ధలతో, సాంప్రదాయాలను పాటిస్తూ బోనాల వేడుకలను ఘనంగా జరుపుకోవాలని విజ్ఞప్తిచేశారు. అమ్మవారి ఆశీస్సులతో మన గ్రామం మరింత అభివృద్ధి చెందాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు వివరించారు.

ఫామ్ సాగు రైతులకు అధిక ఆదాయం అందించే లాభదాయకమైన పంట

- ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

దేవరకొండ ఆగస్టు 3 (మహా ప్రభ)
నల్లగొండ జిల్లా ఉద్యానవన (హార్టికల్చర్) శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మెగా ఆయిల్ ఫామ్ ప్లాంటేషన్ డ్రైవ్కార్యక్రమంలో భాగంగా చింతపల్లి మండలం గడియ గౌరారం శ రోడ్డద్ద రైతు అల్వాల యాదయ్య పొలంలో ఆయిల్ ఫామ్ మొక్కలను దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ సంబంధిత అధికారులతో కలిసి నాటారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఆదాయాన్ని పెంచే లక్ష్యంతో ఆయిల్ ఫామ్ సాగును విస్తృతంగా ప్రోత్సహిస్తోందన్నారు. వంటనూనెల దిగుమతులపై ఆధారపడే పరిస్థితిని తగ్గించడంతో పాటు రైతులకు స్థిరమైన, అధిక ఆదాయాన్ని అందించే పంటగా ఆయిల్ ఫామ్ నిలుస్తుందని పేర్కొన్నారు.ఆయిల్ ఫామ్ సాగు ద్వారా రైతులకు దీర్ఘకాలం పాటు నిరంతర ఆదాయం లభిస్తుందని, మార్కెట్లో మంచి డిమాండ్ ఉండటంతో పాటు ప్రభుత్వ ప్రోత్సాహం కూడా అందుబాటులో ఉంటుందని తెలిపారు. నాణ్యమైన మొక్కల పంపిణీ, సాంకేతిక సలహాలు, సాగు నిర్వహణలో అవసరమైన మార్గదర్శకాలను ఉద్యానవన శాఖ ద్వారా ప్రభుత్వం





అందిస్తున్నదని చెప్పారు. నీటి వనరులు ఉన్న రైతులు ఆయిల్ ఫామ్ సాగు వైపు మొగ్గు చూపితే భవిష్యత్తులో ఆర్థికంగా మరింత బలపడతారని ఎమ్మెల్యే సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డినాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని అత్యున్నత ప్రాధాన్యంగా తీసుకుని పనిచేస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటూనే, పంటలకు గిట్టుబాటు ధర కల్పించడం, సాగునీటి సౌకర్యాల మెరుగుదల, వ్యవసాయానికి అవసరమైన మౌలిక వసతుల అభివృద్ధి, రైతు సంక్షేమానికి అనేక కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు.
దేవరకొండ నియోజకవర్గంలో కూడా వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ, రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని తెలిపారు. వ్యవసాయం లాభసాటిగా మారాలంటే సంప్రదాయ పంటలతో పాటు మార్కెట్ అవకాశాలు ఉన్న ప్రత్యామ్నాయ పంటలను కూడా రైతులు సాగు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులతో కలిసి మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు సంజీవరెడ్డి, దేవరకొండ మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నల్లగొండ జిల్లా అధికార ప్రతినిధి ముచ్చర్ల గిరి, చింతపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జటావత్ హరినాయక్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరుకల వెంకటయ్య గౌడ్, మాజీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, ఉద్యానవన శాఖ అధికారులు, రైతులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్--కామారెడ్డి--ఎల్లారెడ్డి రహదారిని జాతీయ రహదారిగా ప్రకటించాలి

-కేంద్ర మంత్రి బండి సంజయ్ కి ఎల్లారెడ్డి ఎమ్మెల్యే విజ్ఞప్తి!

ఎల్లారెడ్డి, ఆగస్టు 3 (మహాప్రభ)
కరీంనగర్--సిరిసిల్ల--వేములవాడ--కామారెడ్డి--ఎల్లారెడ్డి--పిట్లం వరకు సుమారు 165 కిలోమీటర్ల రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా ప్రకటించి, వెంటనే పరిపాలనా మరియు ఆర్థిక అనుమతులు మంజూరు చేయాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌ను ఢిల్లీలోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్‌ను కలిసి ఇదే అంశంపై వినతిపత్రం సమర్పించారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా ఖఖ్ రహదారి ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, కేంద్ర రోడ్డు రవాణా మరియు జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్



గడ్కరీ ద్వారా తక్షణ ఆమోదం పొందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతిపాదిత జాతీయ రహదారి ఎన్‌హెచ్--563 (కరీంనగర్), ఎన్‌హెచ్--44 (కామారెడ్డి), ఎన్‌హెచ్--765డి (ఎల్లారెడ్డి), ఎన్‌హెచ్--161 (పిట్లం)లను అనుసంధానించే కీలక కారిడార్‌గా మారుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ రహదారి అభివృద్ధి వల్ల ప్రయాణ సమయం తగ్గడంతో పాటు సరుకు రవాణా, వ్యవసాయం, వాణిజ్యం, పరిశ్రమలు, పర్యాటక రంగాలకు ఊతమివ్వడంతో పాటు మహారాష్ట్రతో అనుసంధానం మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే ఈ ప్రతిపాదనకు అవసరమైన సాంకేతిక, పరిపాలనా పరిశీలనలు పూర్తయ్యాయని, తెలంగాణ ప్రభుత్వం పలుమార్లు కేంద్ర ప్రభుత్వానికి సిఫారసులు పంపినట్లు తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఈ ప్రతిపాదనకు తక్షణ ఆమోదం తెలిపి, కరీంనగర్--పిట్లం 165 కిలోమీటర్ల జాతీయ రహదారిని మంజూరు చేసి నిధులు విడుదల చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే మదన్ మోహన్ కోరారు.

తూప్రాన్ అంబేద్కర్ సంఘం నేతృత్వంలో గద్దర్ వర్ధంతి స్మారక పోస్టర్ విడుదల

-భావితరాలకు ప్రజాయుద్ధనౌక ఆదర్శం
-పాటే ప్రశ్నించేతత్వం
-తెలంగాణ ఉద్యమానికి తన పాటలు ఊపిరి
-తన జీవితమంతా ప్రజా పోరాటమే
-గద్దర్ అన్న మూడవ వర్ధంతి స్మారక సభ పోస్టర్ విడుదల కార్యక్రమం నిర్వహించడం జరిగింది.



తూప్రాన్ ఆగస్టు 3(మహాప్రభ)
గద్దర్ అన్న మూడవ వర్ధంతి స్మారక సభ
తేదీ: 06-08-2026 (గురువారం)
సమయం: సాయంత్రం 4:00 గంటల నుండి
వేదిక: రవీంద్ర భారతి, హైదరాబాద్
ఆహ్వానించువారు:
గద్దర్ ఫౌండేషన్
తూప్రాన్ గద్దర్ సేన
ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు గజ్జెల కృష్ణ, సంఘం ప్రధాన కార్యదర్శి మన్నె భాను, మాల మహానాడు రాష్ట్ర నాయకులు శ్యామల అశోక్, మూడో వార్డు కౌన్సిలర్ బైరం సత్య లింగం, రావు, మన్నె రవి, ప్రభాకర్, ఏపుల శాయిప్రసాద్, కాలకంటి సత్యం, తదితరులు పాల్గొన్నారు.

పిన్నపురెడ్డి సరోజనమ్మ దశదిన కార్యక్రమంలో పాల్గొన్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్



దేవరకొండ ఆగస్టు 3 (మహా ప్రభ)
దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ గత సహాయకుడు (పీఏ) పిన్నపురెడ్డి రాజవర్ధన్ రెడ్డి నానమ్మ పిన్నపురెడ్డి సరోజనమ్మ దశదిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సరోజనమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించిన ఎమ్మెల్యే, వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం రాజవర్ధన్ రెడ్డి తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ క్లిష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని, సరోజనమ్మ సేవా భావం, కుటుంబ విలువలు ఎప్పటికీ చిరస్మరణీయంగా నిలిచిపోతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మరణించిన వారి జ్ఞాపకాలు కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ మార్గదర్శకంగా ఉంటాయని, భగవంతుడు వారికి మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్ నాయకులు, పార్టీ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు చేయాలి.

-అన్ని శాఖల సమన్వయంతో వేడుకలను ఘనంగా నిర్వహిద్దాం :
-జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



మెదక్ జిల్లా -03ఆగస్ట్ (మహాప్రభ)
ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను జాతీయ స్ఫూర్తిని ప్రతిబింబించేలా, పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ సంపూర్ణ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులతో సమన్వయ సమావేశంలో నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ, ఆగస్టు 15న పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే జిల్లా స్థాయి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేయాలని సూచించారు. వేదిక, అతిథుల సీటింగ్, తాగునీరు, విద్యుత్, పారిశుద్ధ్యం, వైద్య సదుపాయాలు, ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, తదితర అంశాల్లో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.జిల్లాలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించేలా సమగ్ర జిల్లా ప్రగతి నివేదికను సిద్ధం చేయాలని జిల్లా ప్రణాళికాధికారి కి కలెక్టర్ ఆదేశించారు. ప్రోటోకాల్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ ప్రజాప్రతినిధులు, విశిష్ట అతిథులకు ఆహ్వానాలు పంపాలని సూచించారు. జాతీయ భావనను పెంపొందించేలా విద్యార్థులతో దేశభక్తిని చాటే సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని విద్యాశాఖ, సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రశంసా పత్రాల బహూకరణ కోసం శాఖల వారీగా ఉత్తమ ఉద్యోగుల వివరాలతో కూడిన ప్రతిపాదనలను నిర్ణీత గడువులోగా సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ వేడుకలను విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, డి ఆర్ వో అంబాదాస్ రాజేశ్వర్ , జెడ్పి సీఈఓ ఎల్లయ్య, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

బిజినెస్

సోమవారం బంగారం ధరల్లో మార్పులు.. కొనుగోలుదారులు అప్రమత్తం



వారారంభమైన సోమవారం దేశీయ బంగారం మార్కెట్లో ధరల్లో స్వల్ప మార్పులు నమోదయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధరల హెచ్చుతగ్గులు, డాలర్ మారకం విలువ, భౌగోళిక ఉద్రిక్తతల ప్రభావంతో దేశీయ మార్కెట్‌లో కూడా బంగారం ధరలు కదలిక చూపించాయి. తాజా మార్కెట్ సమాచారం ప్రకారం, 22 క్యారెట్ల బంగారం ధర గ్రాముకు సుమారు 13,250, 24 క్యారెట్ల బంగారం ధర గ్రాముకు 13,900--?14,300 మధ్య కొనసాగుతోంది. నగరాన్ని బట్టి ధరల్లో స్వల్ప తేడాలు ఉండవచ్చు. మార్కెట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం, అంతర్జాతీయ ఆర్థిక పరిణామాలు, అమెరికా వడ్డీ రేట్ల అంచనాలు, ప్రపంచ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితి కారణంగా బంగారం ధరలు సమీప రోజుల్లో కూడా ఒడిదుడుకులకు లోనయ్యే అవకాశం ఉంది. బంగారం కొనుగోలు చేయాలనుకునే వారు తాజా ధరలను పరిశీలించి, హాల్‌మార్క్ ఆభరణాలను మాత్రమే కొనుగోలు చేయాలని జువెలరీ వ్యాపారులు సూచిస్తున్నారు.

జియో బంపరాఫర్.. రూ.400తో సరికొత్త ప్యాకేజ్!



రిలయన్స్ జియో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో సరికొత్త జియో హోమ్ బ్రాడ్‌బ్యాండ్, హోమ్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్లాన్‌లను ప్రారంభించింది. ఈ ప్లాన్‌లు నెలకు రూ. 400 ప్రారంభ ధరతో హై-స్పీడ్ వైఫై, 1,000కి పైగా లైవ్ టీవీ ఛానెల్‌లు, 12-ప్లస్ ఓటీటీ ప్లాట్‌ఫారమ్‌ల సబ్‌స్క్రిప్షన్‌లను అందిస్తాయి. ఈ బండిల్ ఆఫర్ ద్వారా కస్టమర్‌లు బ్రాడ్‌బ్యాండ్, టెలివిజన్, స్ట్రీమింగ్ వినోదాన్ని ఒకే కనెక్షన్, బిల్లుతో పొందవచ్చు. ఫైబర్ నెట్‌వర్క్ ద్వారా ప్రతికూల వాతావరణంలోనూ అంతరాయం లేని సేవలు, లైవ్ టీవీని పాజ్, రివైండ్ చేసే సదుపాయం కూడా ఉన్నాయి.

ఫ్లిప్‌కార్ట్ ప్లస్ యూజర్లకు
ఉచిత నెట్‌ఫ్లిక్స్ సబ్‌స్క్రిప్షన్!



ఫ్లిప్‌కార్ట్, నెట్‌ఫ్లిక్స్‌తో కలిసి తన ప్లస్ మెంబర్లకు ఉచిత నెట్‌ఫ్లిక్స్ మొబైల్ ప్లాన్ సబ్‌స్క్రిప్షన్‌ను అందిస్తోంది. ఈ ఆఫర్ పొందడానికి, ఒకే క్యాలెండర్ నెలలో ఫ్లిప్‌కార్ట్, గ్రాసరీ లేదా మినిట్స్ ద్వారా కనీసం రూ. 299 విలువైన 4 విజయవంతమైన ఆర్డర్‌లను పూర్తి చేయాలి. 4వ ఆర్డర్ పూర్తయిన తర్వాత, ఫ్లిప్‌కార్ట్ యాప్‌లోని 'వీఎ Account > Plus విభాగంలో ఉచిత నెట్‌ఫ్లిక్స్ ప్లాన్‌ను యాక్టివేట్ చేసుకోవచ్చు.

రూ.5 లక్షల కోట్లు పెరిగిన మదుపర్ల సంపద..

-వరుసగా నాలుగో సెషన్‌లోనూ లాభాలు



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ తో చర్చలు ఉంటాయని ప్రకటించడంతో పశ్చిమాసియా లో ఉద్రిక్తతలు చల్లారాయి. దాంతో చమురు ధరలు మరోసారి దిగొచ్చాయి. విదేశీ మదుపర్ల పెట్టుబడులు కలిసొచ్చాయి. దాంతో సూచీలు వరుసగా నాలుగో సెషన్‌లోనూ లాభాల్లో ముగిశాయి. మదుపర్ల సంపద ఒక్క సెషన్‌లోనే రూ.5 లక్షల కోట్ల మేర పెరిగింది. ఉదయం సెన్సెక్స్ 78,883.34 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 78,094.64) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 78,895.10 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి సెన్సెక్స్ 544.39 పాయింట్లు లాభపడి 78,639.03 వద్ద ముగిసింది. నిఫ్టీ 390.70 పాయింట్లు పెరిగి 24,774.30 వద్ద స్థిరపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.31 వద్ద ఉంది. సెన్సెక్స్ 30లో ఇండిగో, టీసీఎస్, ఇన్ఫోసిస్, ఎటర్నల్, ఐటీసీ, యాక్సిస్ బ్యాంక్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. సన్‌ఫార్మా, భారతీ ఎయిర్‌టెల్, మారుతీ, టాటాస్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్ షేర్లు నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 83.83 డాలర్ల వద్ద కొనసాగుతోంది. బంగారం ఔన్స్ ధర 4,054.64 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

స్పోర్ట్స్

రహానే రిటైర్మెంట్‌తో మొదలైన చర్చ..

-భారత క్రికెట్‌కు మరో ఐదుగురు సీనియర్లు గుడ్‌బై చెప్పనున్నారా?



టీమిండియా మాజీ వైస్ కెప్టెన్ అజింక్య రహానే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలకడంతో భారత క్రికెట్‌లో కొత్త చర్చ మొదలైంది. గత కొన్నేళ్లుగా జాతీయ జట్టుకు దూరంగా ఉన్న రహానే, ఇకపై అన్ని ఫార్మాట్ల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. ఈ నిర్ణయం తర్వాత జట్టుకు దూరంగా ఉన్న మరికొందరు సీనియర్ ఆటగాళ్లు కూడా త్వరలోనే రిటైర్మెంట్ ప్రకటించే అవకాశాలపై ఊహాగానాలు జోరందుకున్నాయి. ఒకప్పుడు భారత టెస్ట్ జట్టుకు కీలక బ్యాటర్‌గా, వైస్ కెప్టెన్‌గా సేవలందించిన అజింక్య రహానే గత మూడేళ్లుగా జాతీయ జట్టులో స్థానం దక్కించుకోలేకపోయాడు. దేశవాళీ క్రికెట్‌లో నిలకడగా రాణించినప్పటికీ సెలెక్టర్లు అవకాశాలు ఇవ్వకపోవడంతో చివరికి అంతర్జాతీయ కెరీర్‌కు ముగింపు పలకాలని నిర్ణయించుకున్నాడు. రహానే నిష్క్రమణతో భారత క్రికెట్‌లో ఒక ముఖ్యమైన అధ్యాయం ముగిసిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు టీమిండియా స్వింగ్ స్పెషలిస్ట్ భువనేశ్వర్ కుమార్ ఇప్పటికీ దేశవాళీ క్రికెట్, ఐపీఎల్‌లో మంచి ప్రదర్శనలు చేస్తూనే ఉన్నాడు. ఇటీవల జరిగిన సీజన్‌లోనూ కీలక వికెట్లు తీసి తన అనుభవాన్ని మరోసారి నిరూపించాడు. అయినప్పటికీ భారత జట్టులో అవకాశాలు లేకపోవడంతో అతని భవిష్యత్తుపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే భువీ కూడా అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికే అవకాశం ఉందని ప్రచారం సాగుతోంది.సుదీర్ఘకాలం భారత పేస్ దళానికి నాయకత్వం వహించిన ఇషాంత్ శర్మ కూడా జాతీయ జట్టుకు చాలా కాలంగా దూరంగా ఉన్నాడు. చివరిసారిగా భారత్ తరఫున మరో మ్యాచ్ ఆడి గౌరవప్రదంగా రిటైర్మెంట్ ప్రకటించాలని భావిస్తున్నప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో ఆ అవకాశం దక్కే సూచనలు కనిపించడం లేదు. దీంతో ఆయన కూడా త్వరలోనే అధికారికంగా వీడ్కోలు ప్రకటించే అవకాశాలు ఉన్నాయని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి. టెస్ట్ క్రికెట్‌లో భారత్ తరఫున త్రిబుల్ సెంచరీ సాధించిన అరుదైన బ్యాటర్లలో ఒకడైన కరుణ్ నాయర్‌కు కూడా జట్టులో అవకాశం దక్కడం లేదు. చాలా కాలం తర్వాత జట్టులోకి వచ్చినా వచ్చిన అవకాశాలను పూర్తిగా వినియోగించుకోలేకపోవడంతో మళ్లీ జట్టుకు దూరమయ్యాడు. ప్రస్తుతం అతని రీఎంట్రీ అవకాశాలు కూడా చాలా స్వల్పంగానే కనిపిస్తున్నాయి. మరోవైపు ఆల్‌రౌండర్ శార్దుల్ ఠాకూర్ కూడా యువ ఆటగాళ్ల రాకతో తీవ్ర పోటీని ఎదుర్కొంటున్నాడు. కొత్త తరానికి ప్రాధాన్యం పెరగడంతో అతని అవకాశాలు తగ్గిపోయాయి. ఈ పరిస్థితుల్లో శార్దుల్ కూడా తన భవిష్యత్తుపై త్వరలోనే నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని సమాచారం. భారత స్టార్ ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ షమీ కూడా జాతీయ జట్టుకు దూరంగా ఉన్నాడు. దేశవాళీ క్రికెట్‌లో రాణిస్తున్నప్పటికీ అతడికి అవకాశాలు రాకపోవడంతో అభిమానుల్లోనూ చర్చ మొదలైంది. రహానే రిటైర్మెంట్ అనంతరం భువనేశ్వర్ కుమార్, ఇషాంత్ శర్మ, కరుణ్ నాయర్, శార్దుల్ ఠాకూర్, మహమ్మద్ షమీ భవిష్యత్తుపై ప్రచారం జోరుగా సాగుతున్నప్పటికీ, వీరిలో ఎవరూ ఇప్పటివరకు అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు ప్రకటించలేదు. రానున్న రోజులలో ఏం జరగనుందో చూడాల్సి ఉంది.

చెడు భాషను వాడకండి..

-యువతకు మనూ భాకర్ సందేశం



న్యూఢిల్లీ:
ఒలింపిక్ షూటర్ మనూ భాకర్ తన సోషల్ మీడియా అకౌంట్‌లో ఓ మెసేజ్ పోస్టు చేశారు. చెడు భాష గురించి ఆమె తన మెసేజ్‌లో యువతకు సందేశం ఇచ్చారు. చెడుగా మాట్లాడడం మానుకోవాలని ఆమె యువతను కోరారు. తిట్టుకోవడం, దుర్భాషలాడడం .. మంచి పద్ధతి కాదు అని ఆమె అన్నారు. మీరు మాట్లాడే మాటలే మీ వ్యక్తిత్వాన్ని సూచిస్తాయన్నారు. పారిస్ ఒలింపిక్స్‌లో రెండు పతకాలు గెలిచిన షూటర్ మనూ భాకర్.. తన ఎక్స్ అకౌంట్‌లో సుదీర్ఘ సందేశాన్ని పోస్టు చేశారు. మీ భాషే మీ వ్యక్తిత్వాన్ని సూచిస్తుందని, మీరెలాంటి వాళ్లో చెబుతోందని, మీ పదాలను తెలివిగా ఎంచుకోవాలని, ఎందుంటే మీరు అనుకున్నట్లే మీరు తయారు అవుతారన్నారు.చెడు భాషను వాడడం మంచి పద్ధతి కాదు అని, దుర్భాషలాడడం మానుకోవాలన్నారు. అలా చేస్తే నిర్మలంగా ఉండలేరన్నారు. కూల్‌గా ఉండడం అంటే హార్డ్ వర్క్ చేయడమే అని, దయతో ఉండాలని, ఇతరుల పట్ల గౌరవాన్ని చూపాలన్నారు. మంచితనంతో విజయం సాధించాలన్నారు. మీ పేరెంట్స్, దేశాన్ని గర్వంగా నిలపాలన్నారు. ఈ విషయాన్ని మీకెందుకు చెబుతున్నానంటే, గత కొన్నేళ్ల నుంచి .. చెడు భాషను వాడుతున్న తీరు మారిందన్నారు. చాలా మంది చాలా సాదాసీదాగా చెడు మాటలు మాట్లాడుతున్నారని, దాన్నే కూల్‌గా భావిస్తున్నారని, రోజువారీ మాటల్లో అమర్యాదకర భాషను వాడుతున్నట్లు షూటర్ మనూ భాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. తిట్టడం అంటే కూల్‌గా ఉండడం కాదన్నారు.

ఈశాన్య రాష్ట్రాల్లేకుండా భారత చిత్రపటం..

-గ్లాస్గోలో రెస్టారెంట్ తీరుపై లవ్లీనా అసంతృప్తి



గ్లాస్గో
కామన్వెల్త్ క్రీడలు జరుగుతున్న స్కాట్లాండ్ రాజధాని గ్లాస్గోలో గల భారత సంతతి రెస్టారెంట్ ఒకటి దేశ చిత్రపటాన్ని తప్పుగా ముద్రించి విమర్శల పాలైంది. ఈశాన్య రాష్ట్రాల్లేకుండానే పటాన్ని అంసపూర్తిగా ముద్రించడం వివాదాస్పదమైంది. వివరాల్లోకెళ్తే.. ఈ క్రీడల్లో ఏకంగా ఏడు స్వర్ణాలతో సత్తాచాటిన భారత బాక్సింగ్ బృందం తమ విజయాన్ని సెలబ్రేట్ చేసుకునేందుకు గాను స్థానికంగా ఉన్న 'మిస్టర్ సింగ్స్ ఇండియా ది హోమ్ ఆఫ్ కర్రీ' అనే రెస్టారెంట్‌కు వెళ్లింది. అక్కడ నిర్వాహకులు బాక్సర్లకు భారత చిత్రపటం ఉన్న న్యాప్‌కిన్‌లు ఇచ్చారుఅయితే వాటిపై ఈశాన్య రాష్ట్రాలు లేవని గుర్తించిన లవ్లీనా బోర్డోహెయిన్ నిర్వాహకులను ఉద్దేశిస్తూ.. 'మీరు దీనిని తప్పుగా అనుకోకండి. ఈ మ్యాప్‌లో నార్త్ ఈస్ట్ మిస్ అయింది. హోటల్ ముందు బోర్డులోనూ ఇలాగే ఉంది. ఒక నార్త్ ఈస్ట్‌గా నాకు ఇది చాలా బాధ కలిగించింది. భారత్‌లో ప్రతి ప్రాంతం ముఖ్యమైనదే. మళ్లీ ఇలా జరుగకుండా చూసుకోండి' అని తన అసంతృప్తిని వ్యక్తం చేసింది. అక్కడే ఉన్న బాక్సింగ్ కోచ్ అజయ్ సింగ్ సైతం.. నార్త్ ఈస్ట్ మాత్రమే కాదు, అందులో జమ్మూకాశ్మీర్‌నూ తప్పుగా ముద్రించారని అన్నాడు. కాగా దీనిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తడంతో హోటల్ నిర్వాహకులు తమ తప్పును సరిదిద్దుకుంటామని హామీ ఇచ్చినట్టు అజయ్ సింగ్ తెలిపారు.

‘అగధ’ ట్రైలర్ విడుదల..

-మంత్ర తంత్రాల రహస్యాలతో ఉత్కంఠ రేపుతున్న ఎంఎస్ రాజు!



ప్రముఖ నిర్మాత, దర్శకుడు ఎంఎస్ రాజు మరో విభిన్నమైన కథతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఆయన దర్శకత్వంలో తెరకెక్కుతున్న మిస్టికల్ థ్రిల్లర్ ‘అగధ’ ఇప్పటికే సినీ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తుండగా, తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై అంచనాలను మరింత పెంచేసింది. కామాక్షి భాస్కర్ల, శ్రవణ్ రెడ్డి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీ ఆది వరాహ ప్రొడక్షన్స్ ఎల్ఎల్పీ బ్యానర్‌పై కాశీ విశాలాక్షి బలుసు నిర్మిస్తున్నారు. ఆగస్టు 14న తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషన్ కార్యక్రమాలను చిత్రబృందం వేగవంతం చేసింది. అందులో భాగంగా విడుదలైన ట్రైలర్ ప్రేక్షకులను థ్రిల్లింగ్ ప్రపంచంలోకి తీసుకెళ్తోంది.ట్రైలర్ ప్రారంభం నుంచే మిస్టరీ, ఆధ్యాత్మికత, మంత్ర తంత్రాల నేపథ్యాన్ని ఆసక్తికరంగా పరిచయం చేశారు. “మంత్ర తంత్ర విద్యలకు అందని శక్తి ఉంది... దాని గురించి నాకు తెలియాలి” అంటూ కామాక్షి భాస్కర్ల చెప్పే డైలాగ్ ట్రైలర్‌కు హైలైట్‌గా నిలిచింది. ఈ ఒక్క డైలాగ్‌తోనే సినిమాలో అతీంద్రియ శక్తులు, రహస్యాల చుట్టూ తిరిగే కథ ఉండబోతుందనే సంకేతాలు ఇచ్చారు. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, సినిమాటోగ్రఫీ ట్రైలర్‌కు ప్రధాన బలంగా కనిపిస్తున్నాయి. ప్రతి ఫ్రేమ్‌లోనూ ఉత్కంఠను పెంచేలా ఎంఎస్ రాజు కథనాన్ని రూపొందించినట్లు తెలుస్తోంది. మిస్టరీతో పాటు భావోద్వేగాలు, సస్పెన్స్ అంశాలను సమతూకంగా మేళవించినట్టు ట్రైలర్ స్పష్టం చేస్తోంది. కామాక్షి భాస్కర్ల తన పాత్రలో ఎంతో ఎమోషన్‌ను ప్రదర్శించగా, శ్రవణ్ రెడ్డి కూడా కథలో కీలకమైన పాత్రలో ఆకట్టుకునేలా కనిపిస్తున్నారు. వీరితో పాటు ఇతర నటీనటులు కూడా కథకు తగ్గట్టుగా తమ పాత్రలకు న్యాయం చేసినట్లు ట్రైలర్ ద్వారా అర్థమవుతోంది. ఎంఎస్ రాజు గతంలో కుటుంబ కథా చిత్రాలు, ప్రేమకథలతో విజయాలు అందుకున్నప్పటికీ, ఈసారి పూర్తిగా భిన్నమైన జానర్‌ను ఎంచుకోవడం ఆసక్తికరంగా మారింది. అతీంద్రియ శక్తులు, మంత్ర తంత్రాలు, పురాతన రహస్యాల నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని అందిస్తుందనే నమ్మకంతో చిత్రబృందం ఉంది. ఇప్పటికే ట్రైలర్‌కు సోషల్ మీడియాలో మంచి స్పందన లభిస్తోంది. విజువల్స్, కాన్సెప్ట్, కామాక్షి భాస్కర్ల నటనపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ‘అగధ’ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాల్సి ఉంది.



పోజులో హీటు పెంచుతున్న దిశా పటానీ..

ఈ ఏడాది కాలం నాకు నేర్పింది అదే



నటి అనుపమ పరమేశ్వరన్ భావోద్వేగానికి లోనయ్యారు. గడచిన ఏడాదికాలం తన జీవితం ఎంతో కష్టంగా గడిచిందని, ఒకానొక దశలో మానసికంగా కృంగిపోయానని అనుపమ పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశమయ్యాయి. తమిళ నటుడు ధృవ్‌విక్రమ్‌తో ఆమె ప్రేమలో ఉన్నట్టు, వారి ప్రేమకు బ్రేకప్ అయినట్టు గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో రూమర్లు వినిపిస్తున్నాయి. తాజాగా అనుపమ పరమేశ్వరన్ మాట్లాడింది ఆ విషయం పైనేనంటూ సోషల్ మీడియాలో కొత్త చర్చ మొదలైంది. ఇంకా చెబుతూ ‘ఎంత కష్టపడితే అంత పరిపూర్ణత సిద్ధిస్తుందిఈ ఏడాదికాలం నాకు నేర్పింది అదే. ఇన్నాళ్లూ ఇతరుల కోసం బతికా. నా జీవితం కూడా నా చేతుల్లో లేదు. ఇప్పుడు నాకోసం నేను బతుకుతున్నా. నా జీవితాన్ని నా నియంత్రణలోకి తీసుకున్నా. గతాన్ని వదిలి ధైర్యంగా ముందుకు సాగుతున్నా. ఈ సందర్భంగా కొంతమందికి ఓ విషయం చెప్పాలనుకుంటున్నా. వ్యక్తిగత జీవితంలోని ప్రతి విషయాన్నీ అందరికీ చెప్పాల్సిన అవసరం లేదు’ అంటూ అనుపమ ఘాటుగా స్పందించింది. మరి ఈ వ్యాఖ్యల్లో అంతర్యం ఏమిటో అనుపమకే తెలియాలి.



ఓటీటీలోనూ ‘దీవానా’ దూకుడు..

-50 మిలియన్ స్ట్రీమింగ్ నిమిషాల మైలురాయి చేరుకుందిగా!

థియేటర్లలో మంచి ఆదరణ పొందిన చిత్రం దీవానా. యువ నటులు హర్షిత్ రెడ్డి, స్నేహా మణిమేగలై ప్రధాన పాత్రల్లో రూపొందిన ‘దీవానా’ చిత్రం ఇప్పుడు ఓటీటీలోనూ అదే జోరును కొనసాగిస్తోంది. ప్రముఖ ఓటీటీ వేదిక ఆహాలో ఇటీవల స్ట్రీమింగ్‌కు వచ్చిన ఈ చిత్రం ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణను సొంతం చేసుకుంటూ అరుదైన రికార్డును నమోదు చేసింది.ఆహాలో విడుదలైనప్పటి నుంచి ‘దీవానా’ ఏకంగా 50 మిలియన్ స్ట్రీమింగ్ నిమిషాలు పూర్తి చేసి మరో మైలురాయిని అందుకుంది. థియేటర్లలో పాజిటివ్ టాక్‌తో ఆకట్టుకున్న ఈ సినిమా, ఇప్పుడు డిజిటల్ ప్రేక్షకుల మన్ననలు కూడా పొందుతుండటం విశేషం. మంచి కథ, భావోద్వేగాలు, వినోదం కలగలిసిన ఈ చిత్రం కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకుంటోందని ఓటీటీ వర్గాలు చెబుతున్నాయి.ఈ చిత్రంలో హర్షిత్ రెడ్డి, స్నేహా మణిమేగలై జంటగా నటించగా, ప్రముఖ నటులు నరేష్ విజయ్ కృష్ణ, ఝాన్సీ, బలగం వేణు, జీవన్ కుమార్, టోనీ కీలక పాత్రల్లో కనిపించి కథకు బలాన్నిచ్చారు. వీరి నటన కూడా సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ‘దీవానా’ చిత్రాన్ని వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి సంయుక్తంగా నిర్మించారు. గీతా ఆర్ట్స్, వి స్టూడియోస్, అర్హా మీడియా బ్యానర్లపై రూపొందిన ఈ సినిమాకు ఈశ్వర్ చంద్ర సంగీతాన్ని అందించారు. ఆయన స్వరపరిచిన పాటలు, నేపథ్య సంగీతం సినిమాకు మరింత బలాన్ని చేకూర్చాయి. థియేటర్ల తర్వాత ఓటీటీలో కూడా ఇలాంటి అద్భుతమైన స్పందన రావడంతో చిత్రబృందం ఆనందం వ్యక్తం చేస్తోంది. రానున్న రోజుల్లో ‘దీవానా’ మరిన్ని స్ట్రీమింగ్ రికార్డులు సృష్టించే అవకాశముందని సినీ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.మరి మీరు ఈ సినిమాని మీరు ఇప్పటివరకు చూడకపోతే ఓ లుక్కేయండి మరి.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com